ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 13 నవంబరు 2025


కార్యక్రమానికి వస్తున్న ప్రజలు


ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు



ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

రాయచోటిని సస్యశ్యామలం చేస్తా..


హాజరైన మహిళలు

- నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు సాగునీరు
- రతనాల సీమను చేయడమే లక్ష్యం
- హంద్రీ-నీవా ద్వారా ప్రతి చెరువుకు నీరు
- వెలిగల్లు, శ్రీనివాసపురం రిజర్వాయర్ల ద్వారా రాయచోటికి నీరు
- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడి

నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీరు పారిస్తామని, వెలిగల్లు, శ్రీనివాసపురం రిజర్వాయర్ల ద్వారా రాయచోటికి సాగు, తాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తామని, హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను త్వరలో పూర్తి చేసి రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంతాన్ని రతనాలసీమగా మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. బుధవారం ఆయన రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో పేదల నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రజావేదికలో, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

రాయచోటిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని, హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను పూర్తి చేసి రాయలసీమను రతనాలసీమగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మాణం పూర్తి చేసుకున్న 3 లక్షల పక్కా గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో లబ్ధిదారుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పీఎంఏజేవై పథకం కింద మంజూరైన నిర్మాణాలను పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేయడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.50 వేలు, రూ.70 వేలు చొప్పున అదనపు నిధులను అందించి నేడు సగర్వంగా పేదల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించామని తెలిపారు.

నదుల అనుసంధానం

నదులను అనుసంధానం చేయడం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని, ఇప్పటికే గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేశామని, త్వరలోనే పెన్నా నదితో పాటు ఇతర నదులను కూడా అనుసంధానం చేసి రాయలసీమ ప్రాంతంలోని బీడు భూములను సైతం సాగులోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇవ్వడమే కాకుండా ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి సాగునీరు అందించడం ద్వారా రైతులను మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు.

సూపర్ సిక్స్ సూపర్ హిట్

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాగా ముందుకు సాగుతున్న ప్రభుత్వంలో ఇప్పటికే మనం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశామని తెలిపారు. సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే మహిళల కోసం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడమే కాకుండా రైతన్నలకు అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్ సర్వీస్ పథకం, విద్యాభివృద్ధి కోసం పేద తల్లుల కళ్లల్లో ఆనందం చూసేందుకు తల్లికి వందనం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన, మెగా డీఎస్సీ ద్వారా 16,500 టీచర్ పోస్టులను భర్తీ చేయడం, రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకురావడమే కాకుండా ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా 20 లక్షల ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.

గత ప్రభుత్వంలో రోడ్లన్నీ ధ్వంసమయ్యాయని, గుంతల మయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.500 కోట్లతో రాష్ట్రంలోని రోడ్లన్నీ అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే కూటమి ప్రభుత్వం ముందున్న లక్ష్యమన్నారు. అందుకోసం ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగానే ఉపాధి, ఉద్యోగ కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడికి కూడు, గూడు కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నా బీసీ, నా ఎస్టీ, నా మైనార్టీ, నా ఎస్సీ అంటూ ఒక్కరికి కూడా ఇళ్లు ఇవ్వకుండా అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఇళ్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ఇస్తున్నామన్నారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారుల చేతికి తాళాలు ఇచ్చామని తెలిపారు. పరిపాలన అంటే రాష్ట్రంలోని 175 మంది ఎమ్మెల్యేలు, 25 మంది ఎంపీలు కాదని, 7 కోట్ల మంది ప్రజల భవిష్యత్తు అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు.

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో జల్‌జీవన్ మిషన్ కింద 300 కోట్లతో రాయచోటి నియోజకవర్గంలోని 840 గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించనున్నామన్నారు. అలాగే శ్రీనివాసపురం రిజర్వాయర్ పూర్తి చేయడం ద్వారా 25 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీటిని అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాయచోటి ఏరియా ఆసుపత్రికి వంద పడకల నుంచి 150 పడకలకు చేశామన్నారు. నియోజకవర్గంలోని ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రతి గ్రామంలో బోర్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ అభిమానులు, తదితర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.



ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


హేమలత గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు


గల్ఫ్‌లో ఉన్న షేక్ ముంతాజ్‌బేగం భర్తతో వీడియో కాల్‌లో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం

చిన్నమండెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం ఉదయం 11.40 గంటలకు చిన్నమండెం హెలిప్యాడ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు చేరుకున్నారు. మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, కొలుసు పార్థసారధి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యేలు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, షాజహాన్‌బాషా, అరవ శ్రీధర్, రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ప్రజావేదిక వద్దకు 12-20 గంటలకు చేరుకున్న ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. భోజన విరామ అనంతరం నూతన గృహ వేడుకల్లో భాగంగా పెట్రోల్ బంక్ వెనకాల హేమలత ఇంటికి చేరుకుని హేమలత కుటుంబ సభ్యులతో కలిసి నూతన గృహ వేడుకల్లో పాల్గొని అనంతరం పాలు పొంగించారు. వారికి కిరాణా కొట్టు పెట్టిచ్చేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అలాగే ఇంటి కోసం చేసిన ఒకటిన్నర లక్షల రూపాయల అప్పును తీర్చే మార్గాన్ని ప్రభుత్వం ఆలోచన చేస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం షేక్ ముంతాజ్‌బేగం నూతన గృహ వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి ఆమె భర్త బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లాడని తమకు పిల్లలు ఉంటే అందులో ఒకరు చిన్న వారు, మిగిలిన ఇద్దరికీ తల్లికి వందనం వస్తుందని చెప్పారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి కుటుంబమంతా కలిసి ఉండే విధంగా మీ భర్తకు ఎలక్ట్రికల్ ఆటో ప్రభుత్వమే తీయిస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం హెలిప్యాడ్‌కి ఎదురుగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రి 3.38 నుండి 4.33 నిమిషాల వరకు తన కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు.


చిన్నమండెం హెలిప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబుతో రాజంపేట తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు,రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు




సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, డీఐజీ కోయప్రవీణ్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



ఫొటో గ్యాలరీని తిలకిస్తూ కలెక్టర్ నిశాంత్‌కుమార్‌తో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు


మహిళలతో మాట్లాడుతున్న చంద్రబాబు

కొందరికే పని భారం..

- సిబ్బంది కొరత... కొందరు విధులకు డుమ్మా..
- ఇంకా ఫలితం చూపని రీగ్రూపింగ్
- ఇదీ సచివాలయాల తీరు


ఆంధ్రజ్యోతి విజిట్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వార్డు, గ్రామ సచివాలయాల్లో 10 మందికి తక్కువ కాకుండా వివిధ శాఖల సిబ్బందిని నియమించింది. అయితే ఇందులో చాలామంది ఉద్యోగులకు పెద్దగా పని ఉండడం లేదు. వచ్చామా.. అటెండెన్స్ వేసుకున్నామా.. ఎవరైనా ప్రజలు అవసరాల కోసం వస్తే.. మాట్లాడామా.. వెళ్లిపోయామా.. అనే రీతిలో ఉంటున్నారు. అయితే కొందరికి మాత్రం గొడ్డు చాకిరీ తప్పడం లేదు. సచివాలయంలోకి అడుగు పెట్టినప్పటి నుంచీ సాయంత్రం ఇంటికి వెళ్లే వరకు మీటింగులు, స్వర్ణ పంచాయతీ, హౌసింగ్, ఈకేవైసీ, మనమిత్ర సర్వేలు జరుగుతున్నాయి. దీంతో పలువురు సిబ్బందికి ఇదే పెద్ద పనిగా ఉంది. సర్వేలు, సమీక్షలంటూ పని ఒత్తిడితో ఊపిరి సలపడం లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం సచివాలయాల్లో ఉన్న సిబ్బందిలో ఎక్కువగా పని లేని వారిని రీగ్రూపింగ్ పేరుతో ఇతర ప్రభుత్వ విభాగాలకు మార్చింది. ఒక్కో సచివాలయంలో 6 నుంచి 8 మంది వరకు సిబ్బంది ఉన్నారు. అయితే ఇందులో కొంతమందికే పని భారం పడుతోంది.

పని భారం పడుతున్న శాఖలు

ప్రజలు చెబుతున్న ప్రకారం ఎక్కువగా ఇంజనీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డేటా ఆపరేటర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, వెల్ఫేర్ అసిస్టెంట్, అడ్మిన్‌లకు మాత్రమే పని ఉంటుంది. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు ఇంజనీరింగ్ పనులే కాకుండా అదనంగా ఎన్నికలకు సంబంధించి బీఎల్‌వో విధులు అప్పగించారు. నాడు-నేడు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, పీ4 సర్వే, మన మిత్ర అవర్నేస్ ప్రోగ్రాం, కౌశలం సర్వే, హౌసింగ్ తదితర పనులు అప్పగించారు.

పంచాయతీ కార్యదర్శులు అన్ని శాఖలకు సంబంధించిన పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి. సర్వేలు, కాన్ఫరెన్స్‌లు, సభలు, సమావేశాలు ఉండడంతో వీరిపైనా పనిభారం ఎక్కువగా ఉంటోంది. ఏఎన్ఎంలు రోజూ సచివాలయ పరిధిలో ఫీల్డ్‌కు వెళ్లాలి. వారంలో రెండు రోజులు వ్యాక్సిన్ కార్యక్రమం ఉంటుంది. డిజిటల్ అసిస్టెంట్‌కు ఎక్కువగా సర్టిఫికెట్ల కోసం ప్రజలు సచివాలయాలకు వస్తూ ఉంటారు. మహిళా పోలీసుకు పెద్దగా పనిభారం పడడం లేదు. సచివాలయం దాటి బయటకు వెళ్లే పరిస్థితి దాదాపుగా ఉండడం లేదు. అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్ మొదట్లో విత్తనాల పంపిణీ, ఈ-క్రాపింగ్ పనులు మాత్రమే ఉంటున్నాయి. వీరిని వ్యవసాయ పనులకు తప్ప ఇతర పనులకు ఉపయోగించడం లేదు. వీఆర్‌వోలు ఎక్కువగా తహసీల్దార్ కార్యాలయానికే పరిమితం అవుతున్నారు. వారితో పని పడి ఎవరైనా సచివాలయానికి వచ్చినా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సిందే. పట్టణ ప్రాంతాలలో వీఆర్‌వోలకు ఎక్కువగా.. గ్రామీణ ప్రాంతాలలో తక్కువగా పని భారం ఉంటోంది.


రాజంపేట సాయినగర్ సచివాలయంలో తక్కువ మంది సిబ్బంది హాజరైన దృశ్యం

- రాయచోటిలో 25 వార్డు సచివాలయాలు ఉన్నాయి. రీగ్రూపింగ్ విధానం వల్ల జనాభాను బట్టి 2500 జనాభాకు ఆరుగురు, 3500కు ఏడుమంది, 3500 పైన ఉంటే 8 మంది సిబ్బంది పని చేస్తున్నారు. గతంలో మున్సిపాలిటీ పరిధిలో సచివాలయంలో 10 మంది సిబ్బంది, గ్రామీణ ప్రాంతంలో 11 మంది చొప్పున సిబ్బంది పనిచేసేవారు.
- రాజంపేట పట్టణం 11వ వార్డు సచివాలయంలో 9 మంది సిబ్బందికి గానూ వెల్ఫేర్ అసిస్టెంట్, శానిటేషన్ అసిస్టెంట్, అడ్మిన్, డేటా ఆపరేటర్, ప్లానింగ్ ఆపరేటర్ హాజరయ్యారు.
- మదనపల్లె పట్టణం రామారావు కాలనీ-2 సచివాలయం 17 క్లస్టర్ల పరిధిలో పనిచేస్తుంది. ఇందులో ఎనిమిది మంది ఉద్యోగులు అవసరం ఉండగా.. ఐదు మంది మాత్రమే పనిచేస్తున్నారు. 10.30 గంటలకు ముగ్గురు ఉద్యోగులు మాత్రమే హాజరయ్యారు. మహిళా పోలీసు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్‌లకు డీఎస్సీ ఉద్యోగం రావడంతో ఖాళీగా ఉంది. ఇలా జిల్లా వ్యాప్తంగా అన్ని సచివాలయాల్లోనూ కొందరు పనిభారం ఉంటోంది.

మదనపల్లె టు
బెంగళూరు
- చెలరేగిపోతున్న కిడ్నీ రాకెట్
- కార్పొరేట్ ఆసుపత్రుల కేంద్రంగా మార్పు
- కిడ్నీ ఆపరేషన్‌కు రూ.60 లక్షలు వసూళ్లు
- డోనర్ మృతితో వెలుగులోకి..
6

కిడ్నీ మార్పిడి.. @ మదనపల్లె టు బెంగళూరు

- కార్పొరేట్ ఆసుపత్రుల కేంద్రంగా మార్పు
- కిడ్నీ ఆపరేషన్‌కు రూ.60 లక్షలు వసూళ్లు

మదనపల్లె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో జరిగిన కిడ్నీ ఆపరేషన్ వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. కిడ్నీ డోనర్ నుంచి రిసీవర్ వరకూ కొందరు దళారులు ముఠాగా ఏర్పడి దందా సాగిస్తున్నారు. డయాలసిస్ కేంద్రాల్లో పనిచేస్తున్న టెక్నీషియన్, సిబ్బంది ద్వారా కొన్ని ఆసుపత్రులు, మరికొందరు వైద్యులు సంయుక్తంగా ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇలా మదనపల్లె నుంచి బెంగళూరుకు కిడ్నీలను తరలించి అక్కడి ఆసుపత్రులలో రోగులకు అమరుస్తున్నారు. ఇందుకు మదనపల్లెలో తాజాగా జరిగిన ఘటనే ఉదాహరణ.

విశాఖపట్నంకు చెందిన ఎస్.యమున(29)ని, గాజువాక ఏరియాకు చెందిన పద్మ, సత్యలు కిడ్నీ విక్రయానికి డబ్బులు ఎరగా చూపారు. ఇందులో భాగంగా మదనపల్లె, కదిరి ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాల్లో పనిచేస్తున్న బాలరంగడు, మెహరాజ్‌లను ఆశ్రయించి యమునను మదనపల్లెకు తీసుకొచ్చారు. అన్నమయ్య జిల్లా డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆంజనేయులు నిర్వహిస్తున్న గ్లోబల్ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఇక్కడ డాక్టర్ ఆంజనేయులు కుమారుడు డాక్టర్ అవినాష్ ఆర్థోపెడిక్, కోడలు శాశ్వతి కంటివైద్య నిపుణురాలుగా పనిచేస్తున్నారు. అలాగే కోడలు శాశ్వతి, స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జిగా పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో ఇదే విభాగాల్లో పనిచేస్తున్న టెక్నీషియన్ల ద్వారా కిడ్నీ డోనర్స్‌ను తీసుకొచ్చి ఆపరేషన్లు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇందుకోసం బెంగళూరులోని స్పెషలిస్టులను రప్పించి కిడ్నీ మార్పిడి, రవాణా వ్యవహారం నడుపుతున్నారు. ఇక్కడ జరిగింది కూడా ఇదే. వైజాగ్ ప్రాంతానికి సంబంధించిన మధ్యవర్తులు, యమునాను తీసుకొచ్చి కిడ్నీని తొలగించారు. అలాగే బెంగళూరులోని సూపర్ స్పెషాలిటీ ఆసుత్రులు..కిడ్నీ రిసీవర్స్‌తో ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు పనికానిస్తున్నారు. అయితే డోనర్ యమున మృతితో ఈ కిడ్నీ రాకెట్ వ్యవహారం బయటపడింది.


స్టేషన్ ముందు బంధువులతో కలసి మాట్లాడుతున్న యమున తల్లి సూరమ్మ

గ్లోబల్ ఆసుపత్రిని సీజ్ చేస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు దేవశిరోమణి, రమేష్‌బాబు



స్పెషలిస్టును పిలిపించినా..

డోనర్ నుంచి కిడ్నీని తొలగించి రిసీవర్స్‌కు అమర్చడం చాలా కష్టంతో కూడిన పనిగా చెబుతున్నారు. అయితే అందుకు ఆపరేషన్ థియేటర్, సంబంధించిన పరికరాలన్నీ ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలి. వాటితో పాటు అనుభవజ్ఞుడైన స్పెషలిస్టు కూడా ఉండాలి. కానీ మదనపల్లెలో గ్లోబల్ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ మినహా ఆ స్థాయిలో పరికరాలు, సౌకర్యాలు లేవని చెబుతున్నారు. ముఖ్యంగా కిడ్నీని ఆయా ఇన్‌జక్షన్లతో భద్రపరిచి తరలించే ప్రత్యేక పరికరం కూడా ఉండాలని చెబుతున్నారు. మరోవైపు ఇందుకోసం యూరాలజీ లేదా నెఫ్రాలజీ వైద్యుడు అనస్థీషియాతో పాటు రిసీవర్‌కు అమర్చే స్పెషలిస్టు ఉండాలి. అయితే మదనపల్లెలో మూడునాలుగు ఆసుపత్రులలో తప్పా, ఆపరేషన్ థియేటర్ లేవని చెబుతున్నారు. దీన్ని బట్టి చూస్తే, డాక్టర్ ఆంజనేయులు అనస్థీయా స్పెషలిస్టు, కోడలు శాశ్వతి కూడా డయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జి కావడంతో కిడ్నీ మార్పిడికి అవకాశం ఏర్పడినట్లు చెబుతున్నారు. ఇక్కడ కిడ్నీని ఆపరేషన్‌తో తొలగించే అవకాశమే ఉందని, అందుకే బెంగళూరు నుంచి రప్పించిన స్పెషలిస్టుతో తీసేసి, ఆయన పర్యవేక్షణలో బెంగళూరు లేదా ఇతర ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. అయితే డోనర్‌గా ఉన్న యమున కిడ్నీని గోవాకు చెందిన రిసీవర్ ధీరజ్‌సింగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఈ కిడ్నీ మార్పిడి వ్యవహారంలో మధ్యవర్తులు డోనర్స్‌ను తీసుకొచ్చే బెంగళూరు, హైదరాబాద్, తదితర ప్రాంతాల్లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు తరలించి అక్కడ అందుబాటులో ఉన్న రిసీవర్స్‌కు అమరుస్తున్నట్లు చెబుతున్నారు. ఇందుకోసం రూ.60 లక్షలకు పైగా ఖర్చు అవుతుండగా, డోనర్, మధ్యవర్తులకు రూ.10లక్షలు నుంచి రూ.15లక్షలు ఖర్చు చేస్తున్నట్లు వైద్యరంగ నిపుణులు చెబుతున్నారు. అయితే మదనపల్లె కేంద్రంగా ఇప్పటి వరకూ ఇలా కిడ్నీ రాకెట్ వ్యాపారం జరగలేదని, గ్లోబల్ ఆసుపత్రిలో ఎన్ని రోజులుగా జరుగుతోందోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రుల నిర్వహణకు రూ.కోట్లు ఖర్చు చేస్తూ, ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో కొందరు ఇలాంటి ప్రత్యేకమైన, చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్నట్లు చెబుతున్నారు. సాధారణంగా కిడ్నీ రిసీవర్స్ అంతా డయాలసిస్ రోగులే. అలాంటి వారు చాలా మందే ఉన్నా.. దాన్ని అమర్చుకోవడం సాధారణ, మధ్య తరగతి వర్గాలు ఆ స్థాయిలో డబ్బులు ఖర్చు చేసే అవకాశం లేదు. ప్రస్తుతం ఇలాంటి వారంతా పెద్దపెద్ద వ్యాపారులు, రాజకీయ నాయకులు, ఆర్థిక స్థోమత ఉన్నవారే. వారంతా కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తూ, కిడ్నీలు అమర్చుకుంటుండగా, వీటిని పేద, ఆర్థిక ఇబ్బందులోని బాధితులను ఆశ్రయిస్తున్నారు. ఇందులో రిసీవర్స్ తరఫున వైద్యులు, డోనర్స్ తరఫున ఏజెంట్లు, మధ్యవర్తులుగా డయాలసిస్ కేంద్రాల్లోని టెక్నీషియన్లు ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం సమాజం సరోగసి తరహాలోనే కిడ్నీ వ్యాపారం విస్తరించి ముఠాగా మారినట్లు ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

డోనర్ మృతితో వెలుగులోకి..

- డయాలసిస్ కేంద్రం తనిఖీ
- కిడ్నీ రాకెట్.. గ్లోబల్ ఆసుపత్రి సీజ్
- నిద్రమత్తులో వైద్యశాఖ అధికారులు
- రెండూ తీసేశారా ? బాధితుల అనుమానం

మదనపల్లె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో కిడ్నీ ఆపరేషన్, ఆపై డోనార్ యమున మృతి నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మదనపల్లె పేరు మరోసారి మార్మోగింది. గ్లోబల్ ఆసుపత్రిలో మంగళవారం నాటి సంఘటనతో ఉలిక్కపడ్డ వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రం, సంఘటన జరిగిన గ్లోబల్ ఆస్పత్రిని డీఎంఅండ్‌హెచ్ఓ దేవశిరోమణి, అడిషనల్ డీఎంఅండ్ హెచ్ఓ రమేష్‌బాబు తనిఖీ చేశారు. అందులోని రికార్డులను పరిశీలించారు. ఇక్కడి నిందితునిగా ఉన్న టెక్నీషియన్ బాలరంగని వ్యవహారశైలిపై ఆరా తీశారు. ఈయన ఎన్నిరోజులుగా పనిచేస్తున్నాడు.. రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారు. వారంతా ఎక్కడెక్కడి వారు.. మొదట్లో వస్తున్న వారంతా ఇప్పుడూ కేంద్రానికి వస్తున్నారా? లేదా అనే కోణంలోనూ ఆరా తీసిన అధికారులు, అక్కడి రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని గ్లోబల్ ఆసుపత్రికి చేరుకుని రికార్డులు, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. ఆసుపత్రి అనుమతికి సంబంధించిన రికార్డులు లేకపోవడంతో ఆసుపత్రిని సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

ఇది మొదటిసారేనా..?

మరోవైపు ఇక్కడి ఆసుపత్రిలో ఎన్ని రోజులుగా ఎన్ని ఆపరేషన్లు చేశారు? అందులోని పేషంట్లు, వారికి సంబంధించిన వివరాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో కిడ్నీ ఆపరేషన్‌కు సంబంధించిన అంశాలు ఏమైనా ఉన్నాయా ? అనే కోణంలోనూ డీఎంఅండ్ హెచ్‌వో, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వోలు ఆరా తీస్తున్నట్లు చెబుతున్నారు. తాము ఆసుపత్రిని నిర్వహించలేదని, కొందరు అద్దెకు అడిగితే ఆపరేషన్ థియేటర్ ఇచ్చామని, ఈ సందర్భంగా అక్కడికి వెళ్లిన అధికారులకు డాక్టర్ ఆంజనేయులు కుమారుడు చెప్పినట్లు తెలిసింది. అయితే, ఆయన తండ్రి కూడా ప్రభుత్వ ఉద్యోగి, అందులోనూ జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త హోదాలో ఉంటూ ఇలా జరగడం ఏంటని ప్రశ్నించినట్లు చెబుతున్నారు. మరో వైపు జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో కొన్నింటికి అనుమతులు లేకపోగా, మరికొన్నింటికి ఉన్నా ఇలాంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు జరుగుతున్నా.. జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు.. సంఘటన జరిగాక, హడావిడి తనిఖీలు చేయడం, రికార్డులు ఎత్తుకెళ్లడం, ఆసుపత్రులను సీజ్ చేయడం మినహా.. సాధారణంగా ఆ పనులు చేయడం లేదు. ఆసుపత్రులను పర్యవేక్షించాల్సిన అధికారులే నిద్దరోతుంటే ఇలాంటి సంఘటనలు పునరావృతం కావడం మినహా అడ్డుకట్ట పడదనే వాదన విని పిస్తోంది.

డోనర్ మృతితో వెలుగులోకి..

విశాఖపట్నంకు చెందిన కిడ్నీ డోనార్ యమున మృతితో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అంతా సవ్యంగా జరిగి ఉంటే ఎవరిదారిన వారు వెళ్లిపోయేవారు. అయితే విధి రాతను ఎవరూ తప్పించుకోలేరన్న వాదన నిజమైం దని స్థానికులు నిట్టూరుస్తున్నారు. ఆపరేషన్ అనంతరం మృతిచెందడం, తర్వాత ఈ విషయాన్ని కుటుంబీకులకు సరైన పద్ధతిలో చెప్పడంలో మధ్య వర్తులు పద్మ, సత్యలు విఫలమైనట్లు చెబుతున్నారు. అలాగే మృత దేహాన్ని యమునతో కలిసి ఉంటున్న సూరిబాబుకు చూపించలేదని తెలిసింది. దీంతో మృతురాలికి రెండు కిడ్నీలూ తీసేశారేమోనన్న అనుమానం కలిగినట్లు తెలుస్తోంది. దీంతోనే వివాదం పెద్దదై, చివరకు పోలీసులు, కేసుల వరకూ వెళ్లినట్లు చర్చ నడుస్తోంది.

మొదట సూరిబాబును సర్దుబాటు చేసి తర్వాత మృతదేహాన్ని విశాఖ తరలించి ఉంటే అక్కడ అంతా సవ్యంగా జరిగేదేమోనని భావిస్తున్నారు. యమున కిడ్నీని గోవాకు చెందిన ధీరజ్‌నాయక్‌కు అమర్చడానికి ఒప్పందం కుదుర్చుకోగా, ఇందులో బెంగళూరుకు చెందిన స్పెషలిస్టు ఆపరేషన్ చేసినట్లు స్థానికంగా ప్రచారంలో ఉంది. ఒకే బ్లాడ్ గ్రూపు గల వ్యక్తికి సంబంధించిన కిడ్నీనే కావాల్సి వుంటుంది. అది కూడా చట్టపరంగా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవడం, లేదా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే ప్రాధాన్యత క్రమంలో కావాల్సిన శరీర అవయవాలను సమకూర్చే అవకాశం ఉంది. అది కూడా బతికున్న వారివి కాకుండా, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, మృత్యువుకు దగ్గరలో ఉంటూ, అది కూడా బాధితులే స్వచ్ఛందంగా ఇచ్చే వాటిని స్వీకరించాల్సి వుంటుంది.

కోళ్లబైలు పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

మదనపల్లెటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ కార్యదర్శి మంజులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పంచాయతీ అధికారి ఎ.రాధమ్మ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ప్రజలకు చెల్లించే ఇంటిపన్నులు, పన్నేతర వసూళ్లు, ఫీజులు అన్నీ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి స్వర్ణాంధ్ర పోర్టల్ ద్వారా డిజిటల్ పేమెంటు చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ విషయమై పలుమార్లు టెలీకాన్ఫరెన్స్ ద్వారా అన్ని పంచాయతీ కార్యదర్శులకు సూచనలిచ్చారు. కానీ కోళ్లబైలు పంచాయతీ కార్యదర్శి మంజుల పంచాయతీ పన్నుల వసూళ్లలో చేతివాటం ప్రదర్శించి, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి మాన్యువల్ రసీదులు ఇచ్చి పన్ను వసూలు చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై మదనపల్లె డిప్యూటీ ఎంపీడీఓ భారతి విచారించి నివేదికలను డీపీఓకు పంపారు. డీపీఓ నివేదికలను పరిశీలించిన పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మంజులను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వృద్ధుడు అదృశ్యం - కేసు నమోదు


రెడ్డిశేఖర్‌రెడ్డి (ఫైల్‌పాటో)

మదనపల్లెఅర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధుడు అదృశ్యమైనట్లు మదనపల్లె తాలుకా పోలీసుస్టేషన్‌లో సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, ప్రశాంత్‌నగర్‌కు చెందిన మాజీ సైనికుడు రెడ్డిశేఖర్‌రెడ్డి (60) ఈ నెల 11వ తేదీ ఉదయం నుంచి కనిపించడం లేదు. కాగా అతను మదనపల్లె మండలం, ఎస్టేట్ వద్ద తమకు ఉన్న సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీ వద్ద నుంచి తమ బంధువులకు ఫోన్ చేసి నేను చనిపోతున్నానని మేసేజ్ పెట్టి అక్కడి నుంచి అదృశ్యమయ్యాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసుస్టేషన్‌లో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేశామన్నారు. సమాచారం తెలిస్తే ఎస్ఐ 9440796743, సీఐ 94407 98742కు తెలపాలని సూచించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరులో అక్టోబరు 30న జరిగిన రాష్ట్రస్థాయి సైకిల్ పోలో ఎంపికల్లో ఆడపూరులోని అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతి భను చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ హైమావతి తెలిపారు. తమ కళాశాలలో జూనియర్ బైపీసీ చదువుతున్న అనూష, ప్రవళిక, జూనియర్ ఎంపీసీ విద్యార్థిని దివ్య ఎంపికయ్యారని తెలిపారు. వీరు నవంబరు 15 నుంచి 18 వరకు రాజస్థాన్ రాష్ట్రంలో జరిగే ఫెడరేషన్ కప్‌లో పాల్గొంటారని తెలియజేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సైకిల్ పోలో జిల్లా ప్రెసిడెంట్ యర్రన్న తదితరులు పాల్గొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కలకడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారి పోతువారిపల్లి క్రాస్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలేటి (65) మృతి చెందినట్లు ఎస్ఐ రామంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కేవీపల్లి మండలం తీతావగుంటపల్లి కురవపల్లి వాసి పాలేటి కలకడ సంతకు వచ్చి ద్విచక్ర వాహనంలో తిరిగి ఇంటికి వెళ్తుండగా పీలేరు వైపు నుంచి వస్తున్న మినీట్రక్కు ఢీకొంది. ఘటనలో బాధితుడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మీరు అలిగితే ఓడిపోతాం..

బాగుంటే గెలుపు మనదే

- కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు




కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

చిన్నమండెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీపై అలిగి ఇంట్లో ఉన్న ప్రతిసారి ఓడిపోయాం మీరు అలగకుండా పనిచేస్తే గెలుపు మనదే... భవిష్యత్తులో ఎప్పుడూ ఓడిపోము. పార్టీ అధికారంలో ఉంటేనే కార్యకర్తలకు గౌరవం, టీడీపీ గెలిచిన ప్రతిసారి రాష్ట్ర ప్రగతి పరుగులు పెడితే ఓడిపోయిన ప్రతిసారి పాతాళంలోకి పడిపోతుందని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. అందరికీ ఇళ్ల పథకంలో భాగంగా రాష్ట్రంలోని సొంత ఇళ్లు లేని పేదలకు ఇళ్లు ఇస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఈ హామీ అమల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లి గ్రామంలో సీఎం లబ్ధిదారులతో కలిసి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈసారి కూటమి ప్రభుత్వం ప్రభంజనం వీచినా రాయచోటిలో 1.25 శాతం ఓట్ల తేడాతోనే గెలిచాం. ఈ సారి ఈ గెలుపు మరింత ఎక్కువ ఉండే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత మీదేనని తెలిపారు. కార్యకర్తలను నా కుటుంబ సభ్యులుగా భావిస్తాను. నా కుటుంబ సభ్యులు తప్పు చేసినా ఒప్పుకోను. అలాగే మీరు చేసే ప్రతి మంచి చెడులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నా. గత ప్రభుత్వం కార్యకర్తల మీద పెట్టిన కేసులు, ఆస్తులు లాక్కోవడం వంటి వాటి నుంచి మిమ్మలను కాపాడేందుకు లీగల్ టీంను ఏర్పాటు చేసి మిమ్మలను కాపాడుకున్నాను. పార్టీలో ఏ పదవి రావాలన్నా మీ అభిప్రాయం తీసుకుని మీరు ఆమోదిస్తేనే పదవులు ప్రకటిస్తున్నా. గత ఎన్నికల సమయంలో గెలవలేరు అనుకున్న స్థానాల్లో అభ్యర్థులను మొహమాటం లేకుండా మార్చడంతోనే కూటమితో 164 స్థానాలు గెలచుకోగలిగాం. రాయలసీమను అభివృద్ధి చేసేది మనమే.. రాయలసీమలో ఎక్కువ స్థానాలు వచ్చేలా కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని తెలిపారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్‌గా కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని, నాతో సహా ఎవ్వరూ తప్పు చేసినా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, ప్రతినిత్యం ప్రజల్లో ఉంటేనే రాజకీయాల్లో రాణించగలమని తెలిపారు. పాలిటిక్స్‌ను పాలిటిక్స్‌గానే చూడాలన్నారు. రాయచోటి నియోజకవర్గంలో 459 మంది ముఖ్య నాయకులు ఉన్నారు. వారితో పాటు ఉన్న కార్యకర్తలు సైతం ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలి. దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా టీడీపీ సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి ఏ కార్యకర్త ఆపదలో ఆదుకుంటోందని తెలిపారు. ప్రతి కార్యకర్త ఏ విధంగా పనిచేస్తున్నారో భవిష్యత్తులో వాటిని దృష్టిలో పెట్టుకుని పదవులు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు.

ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు

రాయచోటిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఒక్కరోజు పర్యటనలో భాగంగా రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో మన ఇళ్లు- మన గౌరవం, పేదల సేవలో ప్రజావేదిక కార్యక్రమాలను విజయవంతంగా ముగించుకొని చిన్నమండెం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి కడప విమానాశ్రయానికి సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరారు. మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, ఆర్డీవో శ్రీనివాస్, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి, రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు తదితర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ అభిమానులు సీఎంకు సాదర వీడ్కోలు పలికారు.




సీఎంకు అభివాదం చేస్తున్న మహిళా కార్యకర్తలు, బస్సులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు

మిత్ర మెగా టౌన్‌షిప్‌కు అనుమతి లేదు

- ప్లాట్లు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు
- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపాలిటీ పరిధిలో ఉస్మాన్‌నగర్ సెగ్మెంట్-2 ఏరియాలో నిబంధనలకు వ్యతిరేకంగా మిత్ర మెగా టౌన్‌షిప్ డెవలపర్స్ వారు 49 ఎకరాల్లో లేఅవుట్ వేశారని, ఇందులో ప్లాట్లు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిత్ర మెగా టౌన్‌షిప్ వారు మున్సిపాలిటీ పరిధిలో ఈ ఏడాది జనవరి 20న 49 ఎకరాల్లో అక్రమ లేఅవుట్ వేశారన్నారు. సెక్షన్ 184, 185(1), 360, 360(1) కింద నోటీసులు జారీ చేసి ఉన్నామన్నారు. వీరు ఇంతవరకు లేఅవుట్ మంజూరు కొరకు రాజంపేట పురపాలక సంఘానికి అర్జీ పెట్టలేదన్నారు. లేఅవుట్ మంజూరు లేకుండానే ప్రజలకు ప్లాట్లు అమ్ముతున్నట్లు తమకు తెలిసిందన్నారు. ప్రజలు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మంజూరు కాని లేఅవుట్‌లలో స్థలాలు కొనుగోలు చేయరాదని, ఇళ్లు నిర్మించుకోరాదని తెలిపారు. ఈ అక్రమ లేఅవుట్‌లో ఎవరైనా ఇళ్లు నిర్మిస్తే వాటిని పడగొడతామని, ఈ లేఅవుట్‌లో ప్లాట్లు అమ్మకాలు చేయరాదని తెలిపారు. మిత్ర టౌన్‌షిప్ డెవలపర్స్ వారు లేఅవుట్ మంజూరు కొరకు అర్జీ సమర్పించి లేఅవుట్ మంజూరు చేసుకోవాలని, లేదంటే ఈ ప్లాట్లు అమ్మకాలు చెల్లవని తెలిపారు.

యువకుడిపై పలువురు దాడి

- సోషల్‌మీడియాలో హల్‌చల్


యువకుడిపై దాడి చేస్తున్న దృశ్యం

మదనపల్లెఅర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిని సుమారు 20 మందికి పైగా మైదానంలోకి తీసుకెళ్లి చొక్కా విప్పి కొట్టిన వీడియో సోషల్ మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. స్థానిక టీకేపల్లె, గంగోత్రి కల్యాణ మండపం సమీప మైదానంలో ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఇందులో పలువురు కొడుతుండగా మరొకరు విడిపిస్తున్నట్లు తెలుస్తోంది. వీరు మదనపల్లె పట్టణం, రామారావుకాలనీ, నీరుగట్టువారిపల్లె, వీవర్స్‌కాలనీ యువతగా విశ్వసనీయ సమాచారం. ఈ విష యమై పోలీసులను వివరణ కోరగా.. తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని


ఇ.హాసిని

కలికిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కలికిరి ఇందిరమ్మ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో ఇ.హాసిని విజేతగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ రెడ్డిమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు హాసిని విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. కార్యక్రమంలో పీడీ రెడ్డిమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుజాత, సబిత, హసీనా, కరుణకుమారి, అశోక్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

మత్తులో యువత

● గంజాయికి బానిసలుగా మారి..

● మత్తు ట్యాబ్లెట్లు వాడేస్తున్న వైనం

కడప క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మత్తుకు యువత చిత్తవుతోంది. కొంతవంది చెడు వ్యసనాలకు అలవాటు పడి రాత్రి సమయంలో బ్యాచ్‌లుగా తిరుగుతూ మత్తులో జోగుతున్నారు. తెలిసి తెలియని వయసులో మత్తుకు అలవాటు పడుతున్న యువతను కంట్రోల్ చేయలేక తల్లిదండ్రులు సైతం చేతులెత్తేస్తున్నారు. జల్సాల ఉచ్చులో చెడు తిరుగుళ్లు తిరుగుతూ వారికి పరిచయమైన వ్యక్తుల ద్వారా రహస్యంగా గంజాయిని తెప్పించుకొని తాగుతున్నారు. గంజాయి దొరక్కపోతే మత్తు ట్యాబ్లెట్లు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు వ్యాపారస్థులు ఐదు నుంచి పది రూపాయలు విలువ చేసే మత్తు ట్యాబ్లెట్లు వందలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో యువత ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తుంది. మైనర్లు సైతం గంజాయి వలలో పడి విలవిల్లాడిపోతున్నారు.



యుక్తవయసులోనే అనారోగ్యం పాలు

కడప నగరంలో గంజాయి బ్యాచ్ ఎక్కువవుతోంది. గంజాయిని ఏజన్సీ ప్రాంతాల నుంచి తెప్పించుకుని వాటిని పొట్లాలుగా మార్చి యువతకు ఒక పొట్లం రూ.90 నుంచి 100 వరకు విక్రయిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా మత్తు ఇంజక్ష రూపంలో గంజాయి తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇలా చాలా మంది గంజాయిని సేవిస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. మొదట



సిగరెట్లకు తరువాత మద్యం, ఆ తరువాత గంజాయికి బానిసలవుతున్నారు. కళాశాల, పాఠశాలలు లక్ష్యంగా చేసుకుని కొందరు వీటిని విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.

నగరశివార్లలో బ్యాచ్‌లుగా...

కడప నగర శివార్లలో (సాయిపేట, అల్మాస్‌పేట, ఖలీల్‌నగర్) తదితర ప్రాంతాల్లో మైనర్లు, యువత బ్యాచ్‌లుగా విడిపోయి గంజాయి వాడుతున్నట్లు సమాచారం. గంజాయిని కొనుగోలు చేసేంత శక్తి లేనివారు మత్తు ట్యాబ్లెట్లు వాడుతున్నారు. అదీ లేదంటే టైర్లకు పంక్చర్లు వేసే సోల్యూషన్, వెట్నర్ లాంటివి కూడా మత్తు కోసం వినియోగిస్తున్నట్లు సమాచారం. పోలీసులు వీరిపై నిఘా ఉంచి యువతను మత్తు నుంచి వదిలించాలని పలువురు కోరుతున్నారు.

శాస్త్రీయ పద్ధతులతో వన్యప్రాణుల సంరక్షణ : డీఎఫ్‌వో



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఎఫ్‌వో వినీత్‌కుమార్

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతులు ఉపయోగించడం ద్వారా వన్యప్రాణి సంపదలు కాపాడగలమని జిల్లా అటవీ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. అఖిల భారత పులుల లెక్కింపు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కడప నగర వనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రదేశాల్లో పనిచేసే ప్రతి సిబ్బందికి ఇలాంటి శిక్షణలు అవసరమన్నారు. అటవీ సిబ్బందికే కాకుండా వారితో కలిసి పనిచేసే ప్రతి ఒక్కరికీ ఇలాంటి శిక్షణ ఇవ్వడం మన బాధ్యత అన్నారు. శిక్షణలో భాగంగా పులులను గుర్తించే విధానం, ఇతర వన్యప్రాణులను గుర్తించే పద్ధతులు, అటవీ ప్రదేశాల్లో ఉండాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎంస్ట్రిప్స్ అనే మొబైల్ యాప్ ద్వారా పులుల జాడలను సరిగ్గా నమోదు చేసే విధానం, జీపీఎస్ ఆధారిత ట్రాకింగ్ పద్ధతులు, ఫీల్డ్ సర్వేలో ఉపయోగపడే సాంకేతిక అంశాల గురించి నిపుణులు సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో నంద్యాల, కర్నూలు అటవీ అధికారులు, సబ్ డీఎఫ్‌వోలు, అటవీ పరిధి అధికారులు, ఉప అటవీ అధికారులు, అటవీ సిబ్బంది పాల్గొని శిక్షణ పొందారు.

వివాహిత ఆత్మహత్య

మైదుకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణం కడప రోడ్డులో ఉన్న శ్రీరాంనగర్‌కు చెందిన హర్షిత (19) అనే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... తిమ్మిశెట్టి వెంకటరమణ కుమార్తె హర్షితను స్థానిక విజయనగర్ కాలనీకి చెందిన తరుణ్‌కు ఇచ్చి ఈ ఏడాది జూన్ 6వ తేదీ వివాహం చేశారు. పది రోజుల కిందట తల్లిదండ్రుల వద్దకు వచ్చిన హర్షితను వారు మందలించడంతో మనస్థాపానికి గురై మంగళవారం విషద్రావణం తాగింది. ఆమెను కుటుంబీకులు చికిత్స కోసం కడప రిమ్స్‌కు, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. హర్షిత తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

ప్రొద్దుటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం కొర్రపాడురోడ్డులో నిలబడి వున్న నాగమల్లయ్య (61) అనే వ్యక్తిని మంగళవారం ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయలయ్యాయి. అతన్ని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని ఆంధ్రకేసరి రోడ్డుకు చెందిన నాగమల్లయ్య టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమార్తె వుంది. మంగళవారం భార్య భర్తలిద్దరూ వివేకానంద క్లాత్ మార్కెట్‌లో బట్టలు కొనుగోలు చేసి ఆటోలో ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపై నిలబడ్డారు. అదే సమయంలో కొర్రపాడు రోడ్డు వైపు నుంచి వచ్చిన ఆటో అతి వేగంగా వచ్చి వెనుకవైపు ఢీ కొంది. దీంతో మల్లయ్య రోడ్డుపై కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య వెంకటరమణమ్మ ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నాగమల్లయ్య మృతదేహం

కర్రతో దాడి... వ్యక్తి మృతి

● నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు తెలియజేస్తున్న సీఐ వంశీధర్

ఖాజీపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముత్తులూరుపాడు హరిజనవాడలో కర్రతో దాడి చేసి వ్యక్తి మృతికి కారణమైన నిందితుడిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వంశీధర్ కథనం మేరకు వివరాలిలా... ఈ నెల 3వ తేదీ నరసింహులు అనే వ్యక్తి మద్యం తాగి మోరీపై నిద్రిస్తుండగా.. ఆదారిలో వెళుతున్న ఎల్లయ్య రోజూ మద్యం తాగుతున్నావంటూ హేళన చేశాడు. దీంతో ఆగ్రహించిన నరసింహులు కర్రతో దాడి చేయడంతో ఎల్లయ్య (35) కుప్పకూలి పడిపోయాడు. అతన్ని వైద్యం కోసం రిమ్స్‌కు, అక్కడ నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 5వ తేదీ రాత్రి మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో నరసింహులు బుధవారం భూమాయపల్లె క్రాస్‌రోడ్డు వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ వంశీధర్ తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య

జమ్మలమడుగు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో నివశిస్తున్న పర్వా వెంకటేష్ (74) అనే వృద్ధుడు ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య పది సంవత్సరాల క్రితం మృతి చెందింది. వీరికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటేష్ పట్టణంలోగ్యాస్ సిలిండర్లు రిపేర్లు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఆదివారం అతిగా మద్యం సేవించాడు. మద్యం మత్తులో ఇంటిలో ఉరి వేసుకున్నాడు. ఆరోజు నుంచి ఆ ఇంటి వద్దకు ఎవరు వెళ్లలేదు. బుధవారం దుర్వాసన రావడంతో స్థానికులు అక్కడికి వెళ్లి గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి పోలీసు అధికారులు వచ్చి పరిశీలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గురప్ప తెలిపారు.

హార్సిలీహిల్స్‌లో మంత్రి సత్యకుమార్

బి.కొత్తకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ బుధవారం బి.కొత్త కోట మండల పరిధి పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు విచ్చేశారు. సాయంత్రం 6గంటలకు హిల్స్‌కు చేరుకున్న మంత్రికి ఏపీ టూరిజం సిబ్బంది సాదరస్వాగతం పలికారు. మంత్రి గవర్నర్ బంగ్లాలో విడిది చేశారు. పలువురు బీజేపీ నేతలు, మంత్రి అనుయాయులు సత్యకుమార్‌ను కలిశారు. గురువారం మదనపల్లిలో మంత్రి ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చి హార్సిలీహిల్స్‌లో బసచేసినట్లు తెలుస్తోంది.

జిల్లాలో అన్ని గ్రామాలకు ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలు

● ముదిరెడ్డిపల్లికి తక్షణం సేవలు అందించాలి

● మిలిటరీమెన్ శ్రీనివాసులు ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్

కడప కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని గ్రామాలకు నిరంతరాయంగా టెలిఫోన్, ఇంటర్నెట్ సదుపాయాలు అందేలా చర్యలు చేపడతామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. జిల్లాలోని కలసపాడు మండలం ముదిరెడ్డిపల్లె చెందిన మిలిటరీమెన్ శ్రీనివాసులు తన సొంత ఊరిలో టెలిఫోన్, ఇంటర్నెట్ సౌకర్యం లేక కమ్యూనికేషన్ వ్యవస్థ సరిగా అందక విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఉద్యోగస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విషయాన్ని గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా మంత్రి లోకేశ్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్ బుధవారం తన క్యాంపు కార్యాలయంలో టెలిఫోన్, ఇంటర్నెట్ ప్రొవైడర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వెయ్యిమందికి పైగా మొబైల్ సర్వీసులు ఉన్న ముదిరెడ్డి పల్లెలో వారంలోగా మొబైల్, ఇంటర్నెట్ కనెక్టివిటీ సదుపాయం కల్పించాలన్నారు. ప్రొవైడర్లు ఆయా నెట్‌వర్క్ కంపెనీల పైస్థాయి అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన గ్రామంలో టెలిఫోన్, ఇంటర్నెట్ సదుపాయం కోసం టవర్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మారుమూల గ్రామాలకు సైతం టెలిఫోన్ సిగ్నల్స్ అంతరాయం లేకుండా ఆప్రాంత ప్రజల సౌకర్యార్థం నెట్‌వర్క్ కంపెనీలతో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో కలెక్టరేట్ ఏవో విజయకుమార్, నెట్‌వర్క్ ప్రొవైడర్లు రామ్‌ప్రకాష్ షామీ (బీఎస్ఎన్ఎల్), వెంకటేష్ (ఎయిర్‌టెల్), మణికంఠ (జియో) ముదిరెడ్డిపల్లి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలపై సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ట్రైనీ కలెక్టర్లకు ముగిసిన శిక్షణ



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీకలెక్టర్లు

కురబలకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజులు పర్యటించిన ట్రైనీ కలెక్టర్లకు శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. మండలంలోని కానసానిపల్లె సచివాలయ పరిధిలో వివిధ అంశాలపై పరిశీలించారు. ఈ విషయమై సంబంధిత అధికారులు, ప్రజలతో చర్చించారు. ఆఖరి రోజున తెట్టు పంచాయతీ పరిధిలోని ప్రముఖ విద్యాసంస్థ ఆర్‌సీ పాఠశాల, కురబలకోట జడ్పీ హైస్కూల్‌లో పర్యటించి విద్యావిధానం, మౌలిక వసతులు, నాణ్యమైన విద్యా ప్రమాణాలకు చేపట్టాల్సిన సలహాలు, సూచనలు ఇచ్చారు. మరిన్ని వివరాలను సంబంధిత అధికారుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం విద్యావిధానంపై విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం కురబలకోట ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసి గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగయ్య, ఎంఈఓ ద్వారకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎస్‌జీఎఫ్ అండర్-19 హాకీ జిల్లా స్థాయి ఎంపికలు

కడప స్పోర్ట్స్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఈనెల 14వ తేదీ శుక్రవారం ఉదయం 10గంటలకు అండర్-19 హాకీ జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి చంద్రమోహన్‌రాజు తెలిపారు. జిల్లాలోని హాకీ క్రీడాకారులు అదే రోజు ఉదయం 9గంటల లోపు స్పోర్ట్స్ స్కూల్ హాకీ మైదానం చేరుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9182001781, 9849817064 నెంబర్లను సంప్రదించాలన్నారు.

విధుల నుంచి ప్రధానోపాధ్యాయుడి తొలగింపు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారి మఠంలోని కందిమల్లయ్యపల్లె ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్‌హెచ్ఎం ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ముచ్చర్ల రాధాక్రిష్ణమూర్తిని విధుల నుంచి తొలగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని ప్రధానోపాధ్యాయుడిపై ఆరోపణలు రావడంతో జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో రుజువైనట్లు తేలడంతో విధుల నుంచి తొలగించినట్లు డీఈవో తెలిపారు.

యుద్ధప్రాతిపదికన కల్వర్టు ఏర్పాటు





అధ్వానంగా ఉన్న పంట పొలాలకు వెళ్లే రహదారి, పైపులు వేసి రోడ్డు తయారు చేస్తున్న దృశ్యం

రాజుపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంకకు ఉన్న పైపులు పగిలిపోయి రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. ఈ దుస్థితి మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఈ విషయం రైతులు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి లక్ష రూపాయలు నిధులు మంజూరు చేశారు. దీంతో యుద్ధప్రాతిపదికన (రెండురోజుల్లోనే) కొత్త పైపులు వేసి పంట పొలాలకు దారి ఏర్పాటు చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు







సూర్య, ఎస్‌కె సమీర్, మహ్మద్ నవాజ్

కడప స్పోర్ట్స్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-19 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు బుధవారం డ్రాగా ముగిశాయి. కడప నగర శివారు ప్రాంత కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప- నెల్లూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 280 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో శివచరణ్ 151 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. రెండవ రోజు బుధవారం కడప జట్టు ఓవర్‌నైట్ స్కోర్ 280 పరుగుల వద్దే డిక్లేర్ చేసింది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 348 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో సూర్య 111 పరుగులు సాధించగా, ఎస్.కే. సమీర్ 119, ఎస్‌కె మహమ్మద్ నవాజ్ 58 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో చిత్తూరు-అనంతపురం జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 54 ఓవర్లలో కేవలం 146 పరుగులకే చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 40.1 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 80 పరుగులు చేసింది. రెండో రోజు బుధవారం ఓవర్‌నైట్ స్కోర్ 80 పరుగులతో తిరిగి బ్యాటింగ్‌కు చేపట్టి 87.5 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో మహ్మద్ అజహర్ 50 పరుగులు చేశారు. దీంతో చిత్తూరు జట్టుకు 45 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 43 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలుగా షేక్ గౌసున్నీసాబేగం

కమలాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యా యురాలిగా పరిధిలోని పెద్దచెప్పలి ఎంపీపీ ఉర్దూ స్కూలు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న షేక్ గౌసున్నీసా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందు కుంది. బుధవారం విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ, మైనారిటీస్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాల సందర్భంగా జాతీయ విద్యాదినోత్సవం పురష్కరించుకుని ఆమెకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేశారు. షేక్ గౌసున్నీసాబేగం ఉపాధ్యాయ వృత్తిలో గత 24 సంవత్సరాల నుంచి సేవలందిస్తున్నారు. ఈమె విద్యలో చేస్తున్న సేవలను గుర్తించిన అధికారులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో సహఉపాధ్యాయులు ఆమెకు అబినందనలు తెలిపారు.



మంత్రి ఫరూక్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గౌసున్నీసాబేగం

నైపుణ్యం ఆధారిత విద్య అభివృద్ధి జరగాలి

● వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్



కడప ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాణ్యతతో పాటు నైపుణ్య ఆధారిత విద్యను అభివృద్ధి చేయాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ కోరారు. బుధవారం వైవీయూ తాళ్లపాక అన్నమాచార్య సెనేట్ హాల్లో జరిగిన ప్రిన్సిపాల్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడ్మిషన్ల తగ్గుదలపై సమీక్షించి, విద్యార్థుల అకడమిక్ పెర్మార్మెన్స్ అండ్ అసెస్మెంట్ రికార్డ్ ఐడీలను సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. జాతీయ విద్యావిధానం-2020 అమలు, రోడ్‌మ్యాప్‌పై చర్చిస్తూ విశ్వవిద్యాలయం అన్ని అనుబంధ కళాశాలలకు సహకారం అందిస్తుందని తెలిపారు. విద్యా ప్రమాణాలు, సంస్థాగత పనితీరు మెరుగుపరచడంలో కళాశాలలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కళాశాలల అభివృద్ధి మండలి డీన్ ప్రొఫెసర్ రఘుబాబు, సంపత్‌కుమార్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి సుగవాసి ప్రసాద్‌బాబు స్వాగతం

రాయచోటిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లిలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఎన్టీఆర్ గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును చిన్నమండెం వద్ద హెలిప్యాడ్‌కు చేరుకున్న సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన మౌలా

రైల్వేకోడూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం రైల్వేకోడూరు క్లస్టర్ టీడీపీ ఇన్‌చార్జి పఠాన్ మౌలా కలిశారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. జనసేన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ ప్రజలకు అందుబాటులో ఉండి, సహకారం అందిస్తున్నారని తెలిపారు. కార్యకర్తలు, నాయకులకు ఎక్కడ అన్యాయం జరిగినా వెంటనే స్పందిస్తున్నారని వివరించినట్లుతెలిపారు.

మాజీ సర్పంచ్ మృతదేహానికి ఎమ్మెల్యే, కుడా చైర్మన్ నివాళి


యానాదయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, కుడా చైర్మన్ రూపానందరెడ్డి

పెనగలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సింగనమల మాజీ సర్పంచ్ నీరుగట్టు యానాదయ్య(87) మంగళవారం అర్ధరాత్రి ఆకస్మికంగా మృతిచెందారు. బుధవారం ఉదయం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, సింగనమలలో మృతుని ఇంటికి చేరుకొని మృత దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి, దాసరి దామోదర్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పుచ్చకాయల రవికుమార్, న్యాయవాది రెడ్డయ్య, తెలుగు యువత మాజీ అధ్యక్షుడు సి.సుబ్రమణ్యం, సింగనమల సర్పంచ్ ఎర్రి శివ, ఓబిలి మాజీ సర్పంచ్ ఎస్.హబీబుల్లా, టీడీపీ జిల్లా కార్యదర్శి కె.సుదర్శన్‌చౌదరి తదితరులు నివాళులర్పించారు.

చంద్రబాబు సభకు తరలిన తెలుగు తమ్ముళ్లు

గాలివీడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో గురువారం నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సభకు మండలం నుంచి తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు. మండలంలోని 17 పంచాయతీలకు చెందిన నాయకులు వారిలో ఉన్నారు.

కేంద్ర మంత్రి భూపతిరాజును కలిసిన ముక్కా రూపేశ్

ఓబులవారిపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి పర్యటనకు విచ్చేసిన నరసాపురం పార్లమెంట్ సభ్యుడు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, మండల బీజేపీ అధ్యక్షుడు ముక్కా రూపేశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఆయనకు ఘన స్వాగతం పలికారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల యువత ఎక్కువ శాతం ఉపాధి లేక గల్ఫ్‌దేశాలకు వెళుతున్నారని, వారికి ఉపయోగపడేలా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థిని ఎంపిక

చిట్వేలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న పసుపుల కుసుమతి తైక్వాండో పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు అభినందించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 9న ప్రొద్దుటూరులో నిర్వహించి పోటీల్లో సబ్‌జూనియర్ విభాగంలో రెండో స్థానంలో నిలిచిందన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామికి పూజలు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళంపల్లిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కూటమి ప్రభుత్వంలోనే పేదల కలల సాకారం

● రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు


టిడ్కో ఇంటిని ప్రారంభిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మాటలు కాదు చేతల్లో నిరూపించే ప్రభుత్వమే కూటమి ప్రభుత్వం అని, ప్రతి ఆంధ్రుడు గర్వించేలా అన్నమయ్య జిల్లాలో రాష్ట్ర రథసారథి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటిస్తున్న సమయంలోనే తాను టిడ్కో ఇళ్లను ప్రారంభించడం ఆనందంగా ఉందని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలియజేశారు. బుధవారం రాజంపేట నియోజకవర్గం వీరబల్లి మండలం షికారుపాలెంలో ఆయన టిడ్కో గృహాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సొంతింటి కల ఉంటుందని, నిరుపేదలు ఆర్థిక స్థోమత లేనివారు, పేదలకు సొంతింటి కల తీరనిదని, ఆ లోటును పూడ్చేందుకు ప్రతి ఒక్కరికీ సమాజంలో గౌరవంగా జీవించేందుకు కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కలలు నెరవేర్చే బాధ్యత తీసుకుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, హౌసింగ్ డీఈ మురళీకృష్ణ, ఏఈ మల్లికార్జున, వీరబల్లి క్లస్టర్ ఇన్‌చార్జి పోరుమామిళ్ల చలపతి, తాటికుంటపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు భాస్కర్‌రాజు, దుర్గం ఆంజనేయులు, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంతో భేటీ..


రాజంపేట: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిన్నమండెం మండలానికి వచ్చిన సందర్భంగా రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, రాజంపేట ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి హెలిప్యాడ్ చేరుకున్న తర్వాత ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. తదనంతరం టీడీపీ నిర్వహించిన ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు న్యాయం చేయాలి


ప్రజా వేదిక వద్ద ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్వాసితులు

రాయచోటిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం కారణంగా నిర్వాసితులైన కుటుంబాలకు పరిహారాన్ని అందించి, పునరావాసం కల్పించాలని కోరుతూ బుధవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చిన్నమండెంలో సీఎం పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. . ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు మండెం సుధీర్‌కుమార్ మాట్లాడుతూ 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వం 300 మంది రైతులకు చెందిన 780 ఎకరాల భూములను బలవంతంగా లాక్కుని దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. అందరి కంటే ఎక్కువ పరిహారం ఇస్తామని, అప్పటి వరకు లీజు కింద రూ.45 వేలు చెల్లిస్తామని నమ్మబలికి మోసం చేసిందన్నారు. కేవలం 23 మందికి మాత్రమే నామమాత్రంగా పరిహారాన్ని చెల్లించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినా న్యాయం జరగ లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పరిహారం చెల్లించి, పునరావాస చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులు శ్రీనివాసులు, శివ, సురేశ్, మారెప్ప, మగ్దుంబాషాతో పాటు పెద్ద ఎత్తున నిర్వాసితులు పాల్గొన్నారు.

అడవిని కాపాడుకోవాలి


అడవిలో స్క్వాడ్ రేంజ్ అధికారి సుబ్బరాయుడు

సుండుపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అడవులను కాపాడుకోవడమే లక్ష్యం కావాలని అటవీశాఖ తిరుపతి ఫ్లైయింగ్ స్క్వాడ్ రేంజ్ అధికారి సుబ్బరాయుడు అటవీ సిబ్బందికి సూచించారు. బుదవారం సానిపాయి అటవీ ప్రాంత పరిధిలోని వానరాచపల్లి బీట్ ఎర్రకొండ అడవిలో పర్యటించి పాత ప్లాంటేషన్, గతంలో నిర్మించిన చెక్ డ్యాంలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ బీట్‌లో నరుకుడు మోట్లు, బీటు రిజిస్ట్రేషన్ సమాచారం నమోదు చేయాలన్నారు. బీటులో తిరుగుతూ రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. బీట్ గెజిట్ దగ్గర పెట్టుకోవాలని తెలిపారు. రాయవరం డీఆర్‌వో రమేశ్‌బాబు, వానరాచపల్లి బీటు సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు, స్క్వాడ్ సిబ్బంది చంద్రబాబు, శశికుమార్‌లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై ఉద్యాన విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న హార్టికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు

ఓబులవారిపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా మండలంలోని కొర్లకుంటలో వలంటీర్లు వీధులను శుభ్రం చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లకార్డులు చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలకు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎ.నిశ్చల, డాక్టర్ బి.హరి, మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఎం.జయప్రద, డాక్టర్ టీవీ సురేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ అరుణోదయం, డాక్టర్ తులసి, రామిరెడ్డి, డాక్టర్ కె.సిద్దేశ్వరి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళలు జీవనోపాధి పెంపొందించుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా జీవనోపాధులు పెంపొందించుకోవాలని ఎంపీ డీవో రెడ్డెయ్య తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీ డీవో సభా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏడీఏ పీటీ4ఆర్ ప్రాజెక్టు కింద మండలంలోని ఉద్యాన, పశు సంవర్ధకశాఖ, మత్స్యకార రంగాలతో జీవనోపాధి కల్పించే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వాతావరణ మార్పులకు అనుకూలంగా జీవన శైలిని మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజకుమారి, ఉద్యానవనశాఖ అధికారి సింధూరి, సంయుక్తశాఖ అధికారి మోహన్, తిరుపాల్, ఏపీయం నిరంజన్, ఆర్‌వైఎస్‌ఎస్ ప్రతినిధులు, ప్రాజెక్టు బృందం

టీకాల కార్యక్రమం తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి

ఒంటిమిట్ట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దర్జిపల్లెలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని బుధవారం జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ రవిబాబు తనిఖీ చేశారు. బుధవారం మండలంలోని దర్జిపల్లెలో 104 సంచార వైద్య చికిత్స కేంద్రాన్ని, టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి, సూపర్‌వైజర్, భాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీకి జింపెక్స్ అధినేత రూ. కోటి విరాళం


అదనపు ఏఈవోకు చెక్కు అందజేస్తున్న గోయంకా, విశ్వేశ్వర నాయుడు

రైల్వేకోడూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జింపెక్స్ కంపెనీ అధినేత ఆర్‌ఎస్ గోయంకా మంగళ వారం తిరుమల-తిరుపతి దేవస్థానం ఏఈవో చిరుమామిళ్ల వెంకయ్య చౌదరికి ఆయన కార్యాలయంలో రూ. కోటి విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి దయతో తమతో పాటు తమ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు మంచి జరుగుతోందని, 2005లో శ్రీవారికి వజ్ర కిరీటం కూడా అందజేశామని రైల్వే కోడూరు లో మీడియాకు వివరించారు. ఈ కార్యక్రమంలో జింపెక్స్ లిమిటెడ్ జనరల్ ఏజెంట్ మాచినేని విశ్వేశ్వరనాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి సీతారామ ఆలయ ప్రారంభోత్సవాలు

రాయచోటి నేతాజీ సర్కిల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నారాయణరెడ్డిపల్లె, ముద్దినేనివాండ్లపల్లెలో నేటి నుంచి మూడు రోజుల పాటు సీతారామ ఆలయం ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బుధవారం గ్రామస్తులు తెలిపారు. గురు వారం యాగశాల ప్రవేశం, గణపతిపూజ, సాయంత్రం స్వామి వారి మెరవణి, అంకురార్పణ, గణపతి హోమం, సాయం దీక్ష హోమం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ప్రాతఃకాల పూజ, అభిషేకం, అధివాస , మూల మంత్ర హోమాలు నిర్వహిస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు యంత్ర స్థాపన, ధ్వజ, శిఖరసహిత సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ, స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజులు అన్నదానం చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. భక్తులు విశేషంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

పుల్లంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పంటమార్పిడితో అధిక దిగుబడులు పొందవచ్చునని వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రెడ్డిపల్లె, రామక్కపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగంతో పర్యావరణ కాలుష్యం ఏర్పడుతోందని, రసాయన ఎరువులను తగిన మోతాదులోనే వాడాలన్నారు. రైతుసేవా కేంద్రంలో యూరియా, డీఏపీ అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు ఆధార్ కార్డు, పాసుపుస్తకాలు తీసుకురావాలన్నారు.

ఎండిపోయిన చెట్లను తొలగించండి



లక్ష్మీగారిపల్లె సమీపంలో, చిట్వేలి మార్గంలో ఎండిపోయిన చెట్లు

రైల్వేకోడూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీగారిపల్లె సమీపంలో ప్రధానదారికి పక్కన, గుండాలపల్లె సమీపంలో రైల్వేకోడూరు-చిట్వేలి ప్రధాన దారిలో ఎండిపోయిన చెట్లు కూలిపోయే ప్రమాదం ఉందని, వెంటనే వాటిని తొలగించాలని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో ధర్మాపురం మార్గంలో ఓ పెద్ద వేపచెట్టు ఉన్న పళంగా కూలిపోయింది. ఎండిపోయిన చెట్లు కూలి పోతే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని విద్యుత్ అధికారులు అంటున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆప్కాస్‌లో చేర్చి ఆదుకోవాలి

● సీఎంకు కేజీబీవీ నాన్‌టీచింగ్ సిబ్బంది వినతి

వీరబల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమను ఆప్కాస్‌లో చేర్చి ఆదుకోవాలని కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది బుధవారం ప్రజా సమస్యల వేదికలో సీఎం చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఎనిమిదేళ్లకు ముందు తెలుగుదేశం హయాంలో ఏజెన్సీల ద్వారా నాన్ టీచింగ్ అవుట్‌సోర్సింగ్ ఖాళీలు భర్తీ చేశారన్నారు. ఆ సమయంలో జిల్లా కమిటీల ద్వారా అప్రూవ్ కావలసిన 30 మంది దాకా ఉద్యోగులు ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగా నేటికీ ఇబ్బందులు పడుతున్నారన్నారు. అప్పట్లో ఎన్నికల కోడ్ రావడంతో అప్రూవల్ ఆగిపోయిందన్నారు. అనంతరం ప్రభుత్వం మారడంతో ఎన్నిసార్లు ఉన్నతాధికారులను కలిసినా పట్టించు కోలేద న్నారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినా.. సంబంధిత ఉన్నతా. దికారులకు విన్నవించినా తమ గోడు విన్నవారు లేరన్నారు. దాంతో తమకు వచ్చే జీతాలతో అందరి సిబ్బంది మాదిరిగానే పనిచేస్తున్నామన్నారు. తమను అప్కాస్‌లో చేరిస్తే జీతం పెరగడంతో పాటు ప్రభుత్వ సదుపాయాలు అందే అవకాశం ఉందన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వారు కోరారు.

ఉసిరి చెట్టు కింద పూజలు

చిట్వేలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బుధవారం ఉసిరి చెట్టు కింద సోమస్కందాలు, త్రిశూల అభిషేకం నిర్వహించారు. అనంతరం శివ కేశవులకు మహా నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఉసిరి చెట్టు కింద వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు రాయపెద్ది సతీష్‌శర్మ, సురేంద్రశర్మ, పవన్‌శర్మ, కమిటీ నిర్వాహకులు వీరాంజనేయులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.2.80 కోట్లతో గంగమ్మ ఆలయానికి రోడ్డు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రవీంద్రనగర్, మర్రిమాను నుంచి యనమలపల్లి మీదుగా గంగమ్మ జాతర జరిగే ప్రదేశం వరకు పంచాయతిరాజ్ డీఈ రవీంద్రారెడ్డి తెలిపారు. బుధవారం రోడ్డును పరిశీలించిన ఆయన చౌటపల్లె ప్రజలతో మాట్లాడారు. మార్చి నెలలో జరగనున్న గంగమ్మ జాతరకు పది లక్షలకుపైగా వస్తారని, ఈ ప్రాంతానికి 30 ఏళ్ల కింద వేసిన రోడ్డుకు, ఇంతవరకు మరమ్మతులు కూడా చేయలేదని గ్రామ ప్రజలు డీఈ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీఈ మాట్లాడుతూ ఆర్‌వీ రోడ్డు నుంచి యనమలపల్లి వయా గంగమ్మ జాతరకు రోడ్డు అంచనాలు వేశామని, తొందరలో పనులు ప్రారంభిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ జేఈ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాపై గ్రామీణులకు అవగాహన

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నీటి వృథాను అరికడదామని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి తెలిపారు. నేషనల్ సర్వీస్ స్కీమ్‌లో భాగంగా బుధవారం ఏపీ మోడల్ స్కూల్ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు కొత్తపల్లి గ్రామంలో ర్యాలీ నిర్వహించి. నీటి సంరక్షణ- నీటి వృథాను అరికట్టడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి కొళాయిలు, పైపులు, వాటర్ ట్యాంకులు లీకేజీ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ జల సంరక్షణకు తోడ్పడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరాల రమేశ్, ఉపాధ్యాయులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల సమస్యలపై నిరంతర పోరాటం

రైల్వేకోడూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేద, బలహీన, బడుగు వర్గాల సమస్యలపై నిరంతరాయంగా ఉద్యమాలు చేస్తామని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి, సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య తెలిపారు. రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పేదలకు భూములు ఇవ్వాలని తెలిపారు. ప్రతి నిరుపేద కుటుంబానికి వ్యవసాయ భూములు, ఇంటి స్థలాలు, పక్కా ఇళ్లు ఇవ్వాలన్నారు. మెడికల్ కళాశాలలు, విమానాశ్రాయాలు, ఓడరేవుల ప్రైవేటీకరణ ఆలోచనలను వెంటనే విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్, మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన మొక్కలను అందించాలి

రైల్వేకోడూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన బొప్పాయి మొక్కలను అందించాలని రైల్వేకోడూరు ఉద్యాన శాఖ అధికారి భాస్కర్, రాఘవరాజపురం, అనంతరాజుపేట ఉద్యాన సహాయకులు సుధీర్ కుమార్ వర్మ, రైల్వేకోడూరు, చిట్వేలి ఉద్యానశాఖ అధికారులు సందీప్, లోకేశ్ నర్సరీల యజమానులను ఆదేశించారు. బుధవారం రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజపురం తదితర ప్రాంతాల్లో వారు బొప్పాయి నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నర్సరీ యజమాని తప్పనిసరిగా రికార్డులు నిర్వహించాలన్నారు. మొక్కలు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు ఇవ్వాలన్నారు. నర్సరీ వ్యాపారులందరూ యాక్ట్ 2010 నిబంధనలు పాటించాలన్నారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెంచలకోనలో అన్నదానానికి బియ్యం అందజేత

పెనగలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోనలో నిత్యాన్నదానానికి బుధవారం పి.కొత్తపల్లె, నాగిరెడ్డిపల్లె, ఇండ్లూరు, సాతుపల్లె గ్రామ ప్రజలు అందించిన 70 వేల రూపాయల విరాళాలతో 60 బస్తాల బియ్యం, రెండు బస్తాల కందిపప్పు సమర్పిస్తున్నట్లు కొత్తపల్లె గ్రామ పెద్దలు తలమంచి శివారెడ్డి, ఆకుల చిన్న, మోపాటి జయరాంరెడ్డి, దువ్వూరు జయరామిరెడ్డి, జి.పెంచలయ్య, నల్లం సుబ్బరాయుడు తెలిపారు. బుధవారం ఉదయం కొత్తపల్లెలోని కార్యసిద్ధి వినాయకాలయం వద్ద పెంచలకోనకు బియ్యం తీసుకెళ్లే వాహనానికి పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

పీహెచ్‌సీలో మలేరియా అధికారి తనిఖీలు

ఓబులవారిపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్కావారిపల్లె పీహెచ్‌సీని బుధవారం జోనల్ మలేరియా అధికారి డాక్టర్ నిర్మల్ అలెగ్జాండర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు, మందులను రికార్డులను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులపై డాక్టర్ రాజశేఖర్‌ను ఆరా తీశారు. ఫ్రైడే డ్రైడే, వెక్టర్ కంట్రోల్ హైజీన్ ఆఫ్ అప్‌లోడ్‌ను ఏఎన్‌ఎంలు తప్పకుండా చేయాలని సూచించారు. అనంతరం మంగంపేట సచివాలయాలను సందర్శించి అక్కడ ఎంఎల్‌హెచ్‌పీ ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలకు సీజనల్ వ్యాధుల నివారణపై సూచనలిచ్చారు. మంగంపేటలోని ఏపీఎండీసీ మైన్స్‌ను సందర్శించి సీపీవో గోపీనాథ్ , మైన్స్ జనరల్ మేనేజర్ గణపతి, లేబర్ ఆఫీసర్ శేఖర్‌ను కలిసి తగు సూచనలు ఇచ్చారు. జోనల్ ఆరోగ్య విస్తరణాధికారి నిత్యపూజయ్య, సబ్‌యూనిట్ అధికారి ఎస్‌ఎస్ దాస్, జోనల్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రాక్టికల్ శిక్షణ


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం వెంకటమోహన్

రాయచోటిటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ న్యాచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్‌ఎఫ్) ఆధ్వర్యంలో టీఐసీఆర్‌పీలకు ప్రకృతి వ్యవసాయంపై ఐదు రోజుల ప్రాక్టికల్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ ఐసీఆర్‌పీల విధులు, బాధ్యతలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ సూత్రాలను రైతుల వద్దకు చేర్చడంలో ఐసీఆర్‌పీలు కీలకపాత్ర పోషించాలన్నారు. గొర్లముదివేడు ఏపిలవంకపల్లెలో గీతాంజలి అనే రైతుకు చెందిన పొలంలో మోడళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా టీఐసీఆర్‌పీలకు మోడల్ లక్ష్యాలు, అమలు విధానాలు, రైతుల భాగస్వామ్యంపై వివరించారు. ఇన్‌పుట్ ప్రిపరేషన్‌పై శిక్షణ ఇచ్చి ద్రవజీవామృతం, ఘనజీవామృతం, సీడ్ పెల్లెటైజేషన్ తయారీ విధానం, వాటి ప్రయోజనాలులపై ప్రదర్శన (డెమో) నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, టీఐసీఆర్‌పీలు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి

రైల్వేకోడూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కోరారు. బుధవారం రైల్వేకోడూరులో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందించారు. రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మందల నాగేంద్ర, పట్టణ అధ్యక్షుడు సీహెచ్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: ప్రజా ఉద్యమంలో భాగంగా రాజంపేటలో నిర్వహించిన ర్యాలీలో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఆర్ అండ్ బి బంగ్లా నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డితదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ కార్యాలయ ప్రారంభం

చిన్నమండెం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై మండల టీడీపీ కార్యాలయాన్ని గురువారం ఉదయం 8.30 నిమిషాలకు రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సతీమణి హరిత ప్రారంభిస్తారని మండల టీడీపీ అధ్యక్షుడు మూగి రెడ్డెప్ప తెలిపారు. కావున ఈ కార్యక్రమాన్ని టీడీపీ కుటుంబ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కిడ్నీ మార్పిడి.. @ మదనపల్లె టు బెంగళూరు

- కార్పొరేట్ ఆసుపత్రుల కేంద్రంగా మార్పు
- కిడ్నీ ఆపరేషన్‌కు రూ.60 లక్షలు వసూళ్లు

మదనపల్లె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో జరిగిన కిడ్నీ ఆపరేషన్ వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. కిడ్నీ డోనర్ నుంచి రిసీవర్ వరకూ కొందరు దళారులు ముఠాగా ఏర్పడి దందా సాగిస్తున్నారు. డయాలసిస్ కేంద్రాల్లో పనిచేస్తున్న టెక్నీషియన్, సిబ్బంది ద్వారా కొన్ని ఆసుపత్రులు, మరికొందరు వైద్యులు సంయుక్తంగా ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇలా మదనపల్లె నుంచి బెంగళూరుకు కిడ్నీలను తరలించి అక్కడి ఆసుపత్రులలో రోగులకు అమరుస్తున్నారు. ఇందుకు మదనపల్లెలో తాజాగా జరిగిన ఘటనే ఉదాహరణ.

విశాఖపట్నంకు చెందిన ఎస్.యమున(29)ని, గాజువాక ఏరియాకు చెందిన పద్మ, సత్యలు కిడ్నీ విక్రయానికి డబ్బులు ఎరగా చూపారు. ఇందులో భాగంగా మదనపల్లె, కదిరి ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాల్లో పనిచేస్తున్న బాలరంగడు, మెహరాజ్‌లను ఆశ్రయించి యమునను మదనపల్లెకు తీసుకొచ్చారు. అన్నమయ్య జిల్లా డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆంజనేయులు నిర్వహిస్తున్న గ్లోబల్ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఇక్కడ డాక్టర్ ఆంజనేయులు కుమారుడు డాక్టర్ అవినాష్ ఆర్థోపెడిక్, కోడలు శాశ్వతి కంటివైద్య నిపుణురాలుగా పనిచేస్తున్నారు. అలాగే కోడలు శాశ్వతి, స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జిగా పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో ఇదే విభాగాల్లో పనిచేస్తున్న టెక్నీషియన్ల ద్వారా కిడ్నీ డోనర్స్‌ను తీసుకొచ్చి ఆపరేషన్లు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇందుకోసం బెంగళూరులోని స్పెషలిస్టులను రప్పించి కిడ్నీ మార్పిడి, రవాణా వ్యవహారం నడుపుతున్నారు. ఇక్కడ జరిగింది కూడా ఇదే. వైజాగ్ ప్రాంతానికి సంబంధించిన మధ్యవర్తులు, యమునాను తీసుకొచ్చి కిడ్నీని తొలగించారు. అలాగే బెంగళూరులోని సూపర్ స్పెషాలిటీ ఆసుత్రులు..కిడ్నీ రిసీవర్స్‌తో ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు పనికానిస్తున్నారు. అయితే డోనర్ యమున మృతితో ఈ కిడ్నీ రాకెట్ వ్యవహారం బయటపడింది.



స్టేషన్ ముందు బంధువులతో కలసి మాట్లాడుతున్న యమున తల్లి సూరమ్మ

గ్లోబల్ ఆసుపత్రిని సీజ్ చేస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు దేవశిరోమణి, రమేష్‌బాబు



స్పెషలిస్టును పిలిపించినా..

డోనర్ నుంచి కిడ్నీని తొలగించి రిసీవర్స్‌కు అమర్చడం చాలా కష్టంతో కూడిన పనిగా చెబుతున్నారు. అయితే అందుకు ఆపరేషన్ థియేటర్, సంబంధించిన పరికరాలన్నీ ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలి. వాటితో పాటు అనుభవజ్ఞుడైన స్పెషలిస్టు కూడా ఉండాలి. కానీ మదనపల్లెలో గ్లోబల్ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ మినహా ఆ స్థాయిలో పరికరాలు, సౌకర్యాలు లేవని చెబుతున్నారు. ముఖ్యంగా కిడ్నీని ఆయా ఇన్‌జక్షన్లతో భద్రపరిచి తరలించే ప్రత్యేక పరికరం కూడా ఉండాలని చెబుతున్నారు. మరోవైపు ఇందుకోసం యూరాలజీ లేదా నెఫ్రాలజీ వైద్యుడు అనస్థీషియాతో పాటు రిసీవర్‌కు అమర్చే స్పెషలిస్టు ఉండాలి. అయితే మదనపల్లెలో మూడునాలుగు ఆసుపత్రులలో తప్పా, ఆపరేషన్ థియేటర్ లేవని చెబుతున్నారు. దీన్ని బట్టి చూస్తే, డాక్టర్ ఆంజనేయులు అనస్థీయా స్పెషలిస్టు, కోడలు శాశ్వతి కూడా డయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జి కావడంతో కిడ్నీ మార్పిడికి అవకాశం ఏర్పడినట్లు చెబుతున్నారు. ఇక్కడ కిడ్నీని ఆపరేషన్‌తో తొలగించే అవకాశమే ఉందని, అందుకే బెంగళూరు నుంచి రప్పించిన స్పెషలిస్టుతో తీసేసి, ఆయన పర్యవేక్షణలో బెంగళూరు లేదా ఇతర ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. అయితే డోనర్‌గా ఉన్న యమున కిడ్నీని గోవాకు చెందిన రిసీవర్ ధీరజ్‌సింగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఈ కిడ్నీ మార్పిడి వ్యవహారంలో మధ్యవర్తులు డోనర్స్‌ను తీసుకొచ్చే బెంగళూరు, హైదరాబాద్, తదితర ప్రాంతాల్లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు తరలించి అక్కడ అందుబాటులో ఉన్న రిసీవర్స్‌కు అమరుస్తున్నట్లు చెబుతున్నారు. ఇందుకోసం రూ.60 లక్షలకు పైగా ఖర్చు అవుతుండగా, డోనర్, మధ్యవర్తులకు రూ.10లక్షలు నుంచి రూ.15లక్షలు ఖర్చు చేస్తున్నట్లు వైద్యరంగ నిపుణులు చెబుతున్నారు. అయితే మదనపల్లె కేంద్రంగా ఇప్పటి వరకూ ఇలా కిడ్నీ రాకెట్ వ్యాపారం జరగలేదని, గ్లోబల్ ఆసుపత్రిలో ఎన్ని రోజులుగా జరుగుతోందోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రుల నిర్వహణకు రూ.కోట్లు ఖర్చు చేస్తూ, ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో కొందరు ఇలాంటి ప్రత్యేకమైన, చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్నట్లు చెబుతున్నారు. సాధారణంగా కిడ్నీ రిసీవర్స్ అంతా డయాలసిస్ రోగులే. అలాంటి వారు చాలా మందే ఉన్నా.. దాన్ని అమర్చుకోవడం సాధారణ, మధ్య తరగతి వర్గాలు ఆ స్థాయిలో డబ్బులు ఖర్చు చేసే అవకాశం లేదు. ప్రస్తుతం ఇలాంటి వారంతా పెద్దపెద్ద వ్యాపారులు, రాజకీయ నాయకులు, ఆర్థిక స్థోమత ఉన్నవారే. వారంతా కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తూ, కిడ్నీలు అమర్చుకుంటుండగా, వీటిని పేద, ఆర్థిక ఇబ్బందులోని బాధితులను ఆశ్రయిస్తున్నారు. ఇందులో రిసీవర్స్ తరపున వైద్యులు, డోనర్స్ తరపున ఏజెంట్లు, మధ్యవర్తులుగా డయాలసిస్ కేంద్రాల్లోని టెక్నీషియన్లు ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం సమాజం సరోగసి తరహాలోనే కిడ్నీ వ్యాపారం విస్తరించి ముఠాగా మారినట్లు ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

డోనర్ మృతితో వెలుగులోకి..

- డయాలసిస్ కేంద్రం తనిఖీ
- కిడ్నీ రాకెట్.. గ్లోబల్ ఆసుపత్రి సీజ్
- నిద్రమత్తులో వైద్యశాఖ అధికారులు
- రెండూ తీసేశారా ? బాధితుల అనుమానం

మదనపల్లె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో కిడ్నీ ఆపరేషన్, ఆపై డోనార్ యమున మృతి నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మదనపల్లె పేరు మరోసారి మార్మోగింది. గ్లోబల్ ఆసుపత్రిలో మంగళవారం నాటి సంఘటనతో ఉలిక్కపడ్డ వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రం, సంఘటన జరిగిన గ్లోబల్ ఆస్పత్రిని డీఎంఅండ్‌హెచ్‌ఓ దేవశిరోమణి, అడిషనల్ డీఎంఅండ్ హెచ్‌ఓ రమేష్‌బాబు తనిఖీ చేశారు. అందులోని రికార్డులను పరిశీలించారు. ఇక్కడి నిందితునిగా ఉన్న టెక్నీషియన్ బాలరంగని వ్యవహారశైలిపై ఆరా తీశారు. ఈయన ఎన్నిరోజులుగా పనిచేస్తున్నాడు.. రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారు. వారంతా ఎక్కడెక్కడి వారు.. మొదట్లో వస్తున్న వారంతా ఇప్పుడూ కేంద్రానికి వస్తున్నారా? లేదా అనే కోణంలోనూ ఆరా తీసిన అధికారులు, అక్కడి రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని గ్లోబల్ ఆసుపత్రికి చేరుకుని రికార్డులు, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. ఆసుపత్రి అనుమతికి సంబంధించిన రికార్డులు లేకపోవడంతో ఆసుపత్రిని సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

ఇది మొదటిసారేనా..?

మరోవైపు ఇక్కడి ఆసుపత్రిలో ఎన్ని రోజులుగా ఎన్ని ఆపరేషన్లు చేశారు? అందులోని పేషంట్లు, వారికి సంబంధించిన వివరాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో కిడ్నీ ఆపరేషన్‌కు సంబంధించిన అంశాలు ఏమైనా ఉన్నాయా ? అనే కోణంలోనూ డీఎంఅండ్ హెచ్‌వో, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వోలు ఆరా తీస్తున్నట్లు చెబుతున్నారు. తాము ఆసుపత్రిని నిర్వహించ లేదని, కొందరు అద్దెకు అడిగితే ఆపరేషన్ థియేటర్ ఇచ్చామని, ఈ సందర్భంగా అక్కడికి వెళ్లిన అధికారులకు డాక్టర్ ఆంజనేయులు కుమారుడు చెప్పినట్లు తెలిసింది. అయితే, ఆయన తండ్రి కూడా ప్రభుత్వ ఉద్యోగి, అందులోనూ జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త హోదాలో ఉంటూ ఇలా జరగడం ఏంటని ప్రశ్నించినట్లు చెబుతున్నారు. మరో వైపు జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో కొన్నింటికి అనుమతులు లేకపోగా, మరికొన్నింటికి ఉన్నా ఇలాంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు జరుగుతున్నా.. జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు.. సంఘటన జరిగాక, హడావిడి తనిఖీలు చేయడం, రికార్డులు ఎత్తుకెళ్లడం, ఆసుపత్రులను సీజ్ చేయడం మినహా.. సాధారణంగా ఆ పనులు చేయడం లేదు. ఆసుపత్రులను పర్యవేక్షించాల్సిన అధికారులే నిద్దరో తుంటే ఇలాంటి సంఘటనలు పునరావృతం కావడం మినహా అడ్డుకట్ట పడదనే వాదన విని పిస్తోంది.

డోనర్ మృతితో వెలుగులోకి..

విశాఖపట్నంకు చెందిన కిడ్నీ డోనార్ యమున మృతితో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అంతా సవ్యంగా జరిగి ఉంటే ఎవరిదారిన వారు వెళ్లిపోయేవారు. అయితే విధి రాతను ఎవరూ తప్పించుకోలేరన్న వాదన నిజమైం దని స్థానికులు నిట్టూరుస్తున్నారు. ఆపరేషన్ అనంతరం మృతిచెందడం, తర్వాత ఈ విషయాన్ని కుటుంబీకులకు సరైన పద్ధతిలో చెప్పడంలో మధ్యవర్తులు పద్మ, సత్యలు విఫలమైనట్లు చెబుతున్నారు. అలాగే మృత దేహాన్ని యమునతో కలిసి ఉంటున్న సూరిబాబుకు చూపించలేదని తెలిసింది. దీంతో మృతురాలికి రెండు కిడ్నీలూ తీసేశారేమోనన్న అనుమానం కలిగినట్లు తెలుస్తోంది. దీంతోనే వివాదం పెద్దదై, చివరకు పోలీసులు, కేసుల వరకూ వెళ్లినట్లు చర్చ నడుస్తోంది.

మొదట సూరిబాబును సర్దుబాటు చేసి తర్వాత మృతదేహాన్ని విశాఖ తరలించి ఉంటే అక్కడ అంతా సవ్యంగా జరిగేదేమోనని భావిస్తున్నారు. యమున కిడ్నీని గోవాకు చెందిన ధీరజ్‌నాయక్‌కు అమర్చడానికి ఒప్పందం కుదుర్చుకోగా, ఇందులో బెంగళూరుకు చెందిన స్పెషలిస్టు ఆపరేషన్ చేసినట్లు స్థానికంగా ప్రచారంలో ఉంది. ఒకే బ్లడ్ గ్రూపు గల వ్యక్తికి సంబంధించిన కిడ్నీనే కావాల్సి వుంటుంది. అది కూడా చట్టపరంగా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవడం, లేదా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే ప్రాధాన్యత క్రమంలో కావాల్సిన శరీర అవయవాలను సమకూర్చే అవకాశం ఉంది. అది కూడా బతికున్న వారివి కాకుండా, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, మృత్యువుకు దగ్గరలో ఉంటూ, అది కూడా బాధితులే స్వచ్ఛందంగా ఇచ్చే వాటిని స్వీకరించాల్సి వుంటుంది.

కోళ్లబైలు పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

మదనపల్లెటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ కార్యదర్శి మంజులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పంచాయతీ అధికారి ఎ.రాధమ్మ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ప్రజలకు చెల్లించే ఇంటిపన్నులు, పన్నేతర వసూళ్లు, ఫీజులు అన్నీ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి స్వర్ణాంధ్ర పోర్టల్ ద్వారా డిజిటల్ పేమెంటు చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ విషయమై పలుమార్లు టెలికాన్ఫరెన్స్ ద్వారా అన్ని పంచాయతీ కార్యదర్శులకు సూచనలిచ్చారు. కానీ కోళ్లబైలు పంచాయతీ కార్యదర్శి మంజుల పంచాయతీ పన్నుల వసూళ్లలో చేతివాటం ప్రదర్శించి, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి మాన్యువల్ రసీదులు ఇచ్చి పన్ను వసూలు చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై మదనపల్లె డిప్యూటీ ఎంపీడీఓ భారతి విచారించి నివేదికలను డీపీఓకు పంపారు. డీపీఓ నివేదికలను పరిశీలించిన పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మంజులను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వృద్ధుడు అదృశ్యం - కేసు నమోదు

మదనపల్లెఅర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధుడు అదృశ్యమైనట్లు మదనపల్లె తాలుకా పోలీసుస్టేషన్‌లో సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, ప్రశాంత్‌నగర్‌కు చెందిన మాజీ సైనికుడు రెడ్డిశేఖర్‌రెడ్డి (60) ఈ నెల 11వ తేదీ ఉదయం నుంచి కనిపించడం లేదు. కాగా అతను మదనపల్లె మండలం, ఎస్టేట్ వద్ద తమకు ఉన్న సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీ వద్ద నుంచి తమ బంధువులకు ఫోన్ చేసి నేను చనిపోతున్నానని మేసేజ్ పెట్టి అక్కడి నుంచి అదృశ్యమయ్యాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసుస్టేషన్‌లో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేశామన్నారు. సమాచారం తెలిస్తే ఎస్ఐ 9440796743, సీఐ 94407 98742కు తెలపాలని సూచించారు.


రెడ్డిశేఖర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

నందలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరులో అక్టోబరు 30న జరిగిన రాష్ట్రస్థాయి సైకిల్ పోలో ఎంపికల్లో ఆడపూరులోని అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతి భను చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ హైమావతి తెలిపారు. తమ కళాశాలలో జూనియర్ బైపీసీ చదువుతున్న అనూష, ప్రవళిక, జూనియర్ ఎంపీసీ విద్యార్థిని దివ్య ఎంపికయ్యారని తెలిపారు. వీరు నవంబరు 15 నుంచి 18 వరకు రాజస్థాన్ రాష్ట్రంలో జరిగే ఫెడరేషన్ కప్‌లో పాల్గొంటారని తెలియజేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సైకిల్ పోలో జిల్లా ప్రెసిడెంట్ యర్రన్న తదితరులు పాల్గొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కలకడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారి పోతువారిపల్లి క్రాస్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలేటి (65) మృతి చెందినట్లు ఎస్ఐ రామంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కేవీపల్లి మండలం తీతావగుంటపల్లి కురవపల్లి వాసి పాలేటి కలకడ సంతకు వచ్చి ద్విచక్ర వాహనంలో తిరిగి ఇంటికి వెళ్తుండగా పీలేరు వైపు నుంచి వస్తున్న మినీట్రక్కు ఢీకొంది. ఘటనలో బాధితుడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మీరు అలిగితే ఓడిపోతాం..

బాగుంటే గెలుపు మనదే

- కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

చిన్నమండెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీపై అలిగి ఇంట్లో ఉన్న ప్రతిసారి ఓడిపోయాం మీరు అలగకుండా పనిచేస్తే గెలుపు మనదే... భవిష్యత్తులో ఎప్పుడూ ఓడిపోము. పార్టీ అధికారంలో ఉంటేనే కార్యకర్తలకు గౌరవం, టీడీపీ గెలిచిన ప్రతిసారి రాష్ట్ర ప్రగతి పరుగులు పెడితే ఓడిపోయిన ప్రతిసారి పాతాళంలోకి పడిపోతుందని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రాష్ట్రంలోని సొంత ఇళ్లు లేని పేదలకు ఇళ్లు ఇస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఈ హామీ అమల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లి గ్రామంలో సీఎం లబ్ధిదారులతో కలిసి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈసారి కూటమి ప్రభుత్వం ప్రభంజనం వీచినా రాయచోటిలో 1.25 శాతం ఓట్ల తేడాతోనే గెలిచాం. ఈ సారి ఈ గెలుపు మరింత ఎక్కువ ఉండే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత మీదేనని తెలిపారు. కార్యకర్తలను నా కుటుంబ సభ్యులుగా భావిస్తాను. నా కుటుంబ సభ్యులు తప్పు చేసినా ఒప్పుకోను. అలాగే మీరు చేసే ప్రతి మంచి చెడులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నా. గత ప్రభుత్వం కార్యకర్తల మీద పెట్టిన కేసులు, ఆస్తులు లాక్కోవడం వంటి వాటి నుంచి మిమ్మలను కాపాడేందుకు లీగల్ టీంను ఏర్పాటు చేసి మిమ్మలను కాపాడుకున్నాను. పార్టీలో ఏ పదవి రావాలన్నా మీ అభిప్రాయం తీసుకుని మీరు ఆమోదిస్తేనే పదవులు ప్రకటిస్తున్నా. గత ఎన్నికల సమయంలో గెలవలేరు అనుకున్న స్థానాల్లో అభ్యర్థులను మొహమాటం లేకుండా మార్చడంతోనే కూటమితో 164 స్థానాలు గెలచుకోగలిగాం. రాయలసీమను అభివృద్ధి చేసేది మనమే.. రాయలసీమలో ఎక్కువ స్థానాలు వచ్చేలా కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని తెలిపారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్‌గా కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని, నాతో సహా ఎవ్వరూ తప్పు చేసినా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, ప్రతినిత్యం ప్రజల్లో ఉంటేనే రాజకీయాల్లో రాణించగలమని తెలిపారు. పాలిటిక్స్‌ను పాలిటిక్స్‌గానే చూడాలన్నారు. రాయచోటి నియోజకవర్గంలో 459 మంది ముఖ్య నాయకులు ఉన్నారు. వారితో పాటు ఉన్న కార్యకర్తలు సైతం ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలి. దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా టీడీపీ సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి ఏ కార్యకర్త ఆపదలో ఆదుకుంటోందని తెలిపారు. ప్రతి కార్యకర్త ఏ విధంగా పనిచేస్తున్నారో భవిష్యత్తులో వాటిని దృష్టిలో పెట్టుకుని పదవులు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు.

ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు

రాయచోటిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఒక్క రోజు పర్యటనలో భాగంగా రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో మన ఇళ్లు- మన గౌరవం, పేదల సేవలో ప్రజావేదిక కార్యక్రమాలను విజయవంతంగా ముగించుకొని చిన్నమండెం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి కడప విమానాశ్రయానికి సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరారు. మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, ఆర్డీవో శ్రీనివాస్, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి, రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు తదితర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ అభిమానులు సీఎంకు సాదర వీడ్కోలు పలికారు.



సీఎంకు అభివాదం చేస్తున్న మహిళా కార్యకర్తలు, బస్సులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు

మిత్ర మెగా టౌన్‌షిప్‌కు అనుమతి లేదు

- ప్లాట్లు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు
- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపాలిటీ పరిధిలో ఉస్మాన్‌నగర్ సెగ్మెంట్-2 ఏరియాలో నిబంధనలకు వ్యతిరేకంగా మిత్ర మెగా టౌన్‌షిప్ డెవలపర్స్ వారు 49 ఎకరాల్లో లేఅవుట్ వేశారని, ఇందులో ప్లాట్లు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిత్ర మెగా టౌన్‌షిప్ వారు మున్సిపాలిటీ పరిధిలో ఈ ఏడాది జనవరి 20న 49 ఎకరాల్లో అక్రమ లేఅవుట్ వేశారన్నారు. సెక్షన్ 184, 185(1), 360, 360(1) కింద నోటీసులు జారీ చేసి ఉన్నామన్నారు. వీరు ఇంతవరకు లేఅవుట్ మంజూరు కొరకు రాజంపేట పురపాలక సంఘానికి అర్జీ పెట్టలేదన్నారు. లేఅవుట్ మంజూరు లేకుండానే ప్రజలకు ప్లాట్లు అమ్ముతున్నట్లు తమకు తెలిసిందన్నారు. ప్రజలు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మంజూరు కాని లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేయరాదని, ఇళ్లు నిర్మించుకోరాదని తెలిపారు. ఈ అక్రమ లేఅవుట్‌లో ఎవరైనా ఇళ్లు నిర్మిస్తే వాటిని పడగొడతామని, ఈ లేఅవుట్‌లో ప్లాట్లు అమ్మకాలు చేయరాదని తెలిపారు. మిత్ర టౌన్‌షిప్ డెవలపర్స్ వారు లేఅవుట్ మంజూరు కొరకు అర్జీ సమర్పించి లేఅవుట్ మంజూరు చేసుకోవాలని, లేదంటే ఈ ప్లాట్లు అమ్మకాలు చెల్లవని తెలిపారు.

యువకుడిపై పలువురు దాడి

- సోషల్‌మీడియాలో హల్‌చల్


యువకుడిపై దాడి చేస్తున్న దృశ్యం

మదనపల్లెఅర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిని సుమారు 20 మందికి పైగా మైదానంలోకి తీసుకెళ్లి చొక్కా విప్పి కొట్టిన వీడియో సోషల్ మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. స్థానిక బీకేపల్లె, గంగోత్రి కల్యాణ మండపం సమీప మైదానంలో ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఇందులో పలువురు కొడుతుండగా మరొకరు విడిపిస్తున్నట్లు తెలుస్తోంది. వీరు మదనపల్లె పట్టణం, రామారావుకాలనీ, నీరుగట్టువారిపల్లె, వీవర్స్‌కాలనీ యువతగా విశ్వసనీయ సమాచారం. ఈ విష యమై పోలీసులను వివరణ కోరగా.. తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని

కలికిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కలికిరి ఇందిరమ్మ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో ఇ.హాసిని విజేతగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ రెడ్డిమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు హాసిని విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. కార్యక్రమంలో పీడీ రెడ్డిమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుజాత, సబిత, హసీనా, కరుణకుమారి, అశోక్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.


ఇ.హాసిని

మత్తులో యువత

- గంజాయికి బానిసలుగా మారి..
- మత్తు ట్యాబ్లెట్లు వాడేస్తున్నవైనం

కడప క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మత్తుకు యువత చిత్తవుతోంది. కొంతవంది చెడు వ్యసనాలకు అలవాటు పడి రాత్రి సమయంలో బ్యాచ్‌లుగా తిరుగుతూ మత్తులో జోగుతున్నారు. తెలిసి తెలియని వయసులో మత్తుకు అలవాటు పడుతున్న యువతను కంట్రోల్ చేయలేక తల్లిదండ్రులు సైతం చేతులేత్తేస్తున్నారు. జల్సాల ఉచ్చులో చెడు తిరుగుళ్ల తిరుగుతూ వారికి పరిచయమైన వ్యక్తుల ద్వారా రహస్యంగా గంజాయిని తెప్పించుకొని తాగుతున్నారు. గంజాయి దొరక్కపోతే మత్తు ట్యాబ్లెట్లు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు వ్యాపారస్థులు ఐదు నుంచి పది రూపాయలు విలువ చేసే మత్తు ట్యాబ్లెట్లు వందలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో యువత ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తుంది. మైనర్లు సైతం గంజాయి వలలో పడి విలవిల్లాడిపోతున్నారు.





యుక్తవయసులోనే అనారోగ్యం పాలు

కడప నగరంలో గంజాయి బ్యాచ్ ఎక్కువవుతోంది. గంజాయిని ఏజెన్సీ ప్రాంతాల నుంచి తెప్పించుకుని వాటిని పొట్లాలుగా మార్చి యువతకు ఒక పొట్లం రూ.90 నుంచి 100 వరకు విక్రయిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా మత్తు ఇంజక్ష రూపంలో గంజాయి తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇలా చాలా మంది గంజాయిని సేవిస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. మొదట సిగరెట్లకు తరువాత మద్యం, ఆ తరువాత గంజాయికి బానిసలవుతున్నారు. కళాశాల, పాఠశాలలు లక్ష్యంగా చేసుకుని కొందరు వీటిని విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.

నగరశివార్లలో బ్యాచ్‌లుగా...

కడప నగర శివార్లలో (సాయిపేట, అల్మాస్‌పేట, ఖలీల్‌నగర్) తదితర ప్రాంతాల్లో మైనర్లు, యువత బ్యాచ్‌లుగా విడిపోయి గంజాయి వాడుతున్నట్లు సమాచారం. గంజాయిని కొనుగోలు చేసేంత శక్తి లేనివారు మత్తు ట్యాబ్లెట్లు వాడుతున్నారు. అదీ లేదంటే టైర్లకు పంక్చర్లు వేసే సొల్యూషన్, వెట్నర్ లాంటివి కూడా మత్తు కోసం వినియోగిస్తున్నట్లు సమాచారం. పోలీసులు వీరిపై నిఘా ఉంచి యువతను మత్తు నుంచి వదిలించాలని పలువురు కోరుతున్నారు.

శాస్త్రీయ పద్ధతులతో వన్యప్రాణుల సంరక్షణ : డీఎఫ్‌వో



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఎఫ్‌వో వినీత్‌కుమార్

కడప ఎన్జీఆర్ సర్కిల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతులు ఉపయోగించడం ద్వారా వన్యప్రాణి సంపదలు కాపాడగలమని జిల్లా అటవీ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. అఖిల భారత పులుల లెక్కింపు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కడప నగర వనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రదేశాల్లో పనిచేసే ప్రతి సిబ్బందికి ఇలాంటి శిక్షణలు అవసరమన్నారు. అటవీ సిబ్బందికే కాకుండా వారితో కలిసి పనిచేసే ప్రతి ఒక్కరికీ ఇలాంటి శిక్షణ ఇవ్వడం మన బాధ్యత అన్నారు. శిక్షణలో భాగంగా పులులను గుర్తించే విధానం, ఇతర వన్యప్రాణులను గుర్తించే పద్ధతులు, అటవీ ప్రదేశాల్లో ఉండాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎంస్ట్రిప్స్ అనే మొబైల్ యాప్ ద్వారా పులుల జాడలను సరిగ్గా నమోదు చేసే విధానం, జీపీఎస్ ఆధారిత ట్రాకింగ్ పద్ధతులు, ఫీల్డ్ సర్వేలో ఉపయోగపడే సాంకేతిక అంశాల గురించి నిపుణులు సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో నంద్యాల, కర్నూలు అటవీ అధికారులు, సబ్ డీఎఫ్‌వోలు, అటవీ పరిధి అధికారులు, ఉప అటవీ అధికారులు, అటవీ సిబ్బంది పాల్గొని శిక్షణ పొందారు.

వివాహిత ఆత్మహత్య

మైదుకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణం కడప రోడ్డులో ఉన్న శ్రీరాంనగర్‌కు చెందిన హర్షిత (19) అనే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... తిమ్మిశెట్టి వెంకటరమణ కుమార్తె హర్షితను స్థానిక విజయనగర్ కాలనీకి చెందిన తరుణ్‌కు ఇచ్చి ఈ ఏడాది జూన్ 6వ తేదీ వివాహం చేశారు. పది రోజుల కిందట తల్లిదండ్రుల వద్దకు వచ్చిన హర్షితను వారు మందలించడంతో మనస్థాపానికి గురై మంగళవారం విషద్రావణం తాగింది. ఆమెను కుటుంబీకులు చికిత్స కోసం కడప రిమ్స్‌కు, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. హర్షిత తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి



నాగమల్లయ్య మృతదేహం

ప్రొద్దుటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం కొర్రపాడురోడ్డులో నిలబడి వున్న నాగమల్లయ్య (61) అనే వ్యక్తిని మంగళవారం ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయలయ్యాయి. అతన్ని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని ఆంధ్రకేసరి రోడ్డుకు చెందిన నాగమల్లయ్య టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య కుమార్తె వుంది. మంగళవారం భార్య భర్తలిద్దరూ వివేకానంద క్లాత్ మార్కెట్‌లో బట్టలు కొనుగోలు చేసి ఆటోలో ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపై నిలబడ్డారు. అదే సమయంలో కొర్రపాడు రోడ్డు వైపు నుంచి వచ్చిన ఆటో అతి వేగంగా వచ్చి వెనుకవైపు ఢీ కొంది. దీంతో మల్లయ్య రోడ్డుపై కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య వెంకటరమణమ్మ ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్రతో దాడి... వ్యక్తి మృతి

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు తెలియజేస్తున్న సీఐ వంశీధర్

ఖాజీపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముత్తులూరుపాడు హరిజనవాడలో కర్రతో దాడి చేసి వ్యక్తి మృతికి కారణమైన నిందితుడిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వంశీధర్ కథనం మేరకు వివరాలిలా... ఈ నెల 3వ తేదీ నరసింహులు అనే వ్యక్తి మద్యం తాగి మోరీపై నిద్రిస్తుండగా.. ఆదారిలో వెళుతున్న ఎల్లయ్య రోజూ మద్యం తాగుతున్నావంటూ హేళన చేశాడు. దీంతో ఆగ్రహించిన నరసింహులు కర్రతో దాడి చేయడంతో ఎల్లయ్య (35) కుప్పకూలి పడిపోయాడు. అతన్ని వైద్యం కోసం రిమ్స్‌కు, అక్కడ నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 5వ తేదీ రాత్రి మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో నరసింహులు బుధవారం భూమాయపల్లె క్రాస్‌రోడ్డు వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ వంశీధర్ తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య

జమ్మలమడుగు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో నివశిస్తున్న పర్శా వెంకటేష్ (74) అనే వృద్ధుడు ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య పది సంవత్సరాల క్రితం మృతి చెందింది. వీరికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటేష్ పట్టణంలోగ్యాస్ సిలిండర్లు రిపేర్లు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఆదివారం అతిగా మద్యం సేవించాడు. మద్యం మత్తులో ఇంటిలో ఉరి వేసుకున్నాడు. ఆరోజు నుంచి ఆ ఇంటి వద్దకు ఎవరు వెళ్లలేదు. బుధవారం దుర్వాసన రావడంతో స్థానికులు అక్కడికి వెళ్లి గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి పోలీసు అధికారులు వచ్చి పరిశీలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గురప్ప తెలిపారు.

మెడికల్ విద్యార్థి శ్రీనిత్య ప్రతిభ

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2024-25 సంబంధించి అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగం విద్యార్థి శ్రీనిత్యసురగౌరి మొదటి సంవత్సరం ఫలితాలలో 900కి 749 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి యూనివర్సిటీ స్థాయిలో మొదటి స్థానం సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ జమున తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయంలో శ్రీనిత్యసురగౌరిని ప్రిన్సిపాల్ జమున, వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు అభినందించారు.

జిల్లాలో అన్ని గ్రామాలకు ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలు

- ముదిరెడ్డిపల్లికి తక్షణం సేవలు అందించాలి
- మిలిటరీమెన్ శ్రీనివాసులు ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్

కడప కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని గ్రామాలకు నిరంతరాయంగా టెలిఫోన్, ఇంటర్నెట్ సదుపాయాలు అందేలా చర్యలు చేపడతామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. జిల్లాలోని కలసపాడు మండలం ముదిరెడ్డిపల్లె చెందిన మిలిటరీమెన్ శ్రీనివాసులు తన సొంత ఊరిలో టెలిఫోన్, ఇంటర్నెట్ సౌకర్యం లేక కమ్యూనికేషన్ వ్యవస్థ సరిగా అందక విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఉద్యోగస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విషయాన్ని గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా మంత్రి లోకేశ్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్ బుధవారం తన క్యాంపు కార్యాలయంలో టెలిఫోన్, ఇంటర్నెట్ ప్రొవైడర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వెయ్యిమందికి పైగా మొబైల్ సర్వీసులు ఉన్న ముదిరెడ్డి పల్లెలో వారంలోగా మొబైల్, ఇంటర్నెట్ కనెక్టివిటీ సదుపాయం కల్పించాలన్నారు. ప్రొవైడర్లు ఆయా నెట్‌వర్క్ కంపెనీల పైస్థాయి అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన గ్రామంలో టెలిఫోన్, ఇంటర్నెట్ సదుపాయం కోసం టవర్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మారుమూల గ్రామాలకు సైతం టెలిఫోన్ సిగ్నల్స్ అంతరాయం లేకుండా ఆప్రాంత ప్రజల సౌకర్యార్థం నెట్‌వర్క్ కంపెనీలతో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో కలెక్టరేట్ ఏవో విజయకుమార్, నెట్‌వర్క్ ప్రొవైడర్లు రామ్‌ప్రకాష్ షామీ (బీఎస్ఎన్ఎల్), వెంకటేష్ (ఎయిర్‌టెల్), మణికంద (జియో) ముదిరెడ్డిపల్లి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలపై సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ట్రైనీ కలెక్టర్లకు ముగిసిన శిక్షణ



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీకలెక్టర్లు

కురబలకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజులు పర్యటించిన ట్రైనీ కలెక్టర్లకు శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. మండలంలోని కానసానిపల్లె సచివాలయ పరిధిలో వివిధ అంశాలపై పరిశీలించారు. ఈ విషయమై సంబంధిత అధికారులు, ప్రజలతో చర్చించారు. ఆఖరి రోజున తెట్టు పంచాయతీ పరిధిలోని ప్రముఖ విద్యాసంస్థ ఆర్‌సీ పాఠశాల, కురబలకోట జడ్పీ హైస్కూల్‌లో పర్యటించి విద్యావిధానం, మౌలిక వసతులు, నాణ్యమైన విద్యా ప్రమాణాలకు చేపట్టాల్సిన సలహాలు, సూచనలు ఇచ్చారు. మరిన్ని వివరాలను సంబంధిత అధికారుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం విద్యావిధానంపై విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం కురబలకోట ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసి గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగయ్య, ఎంఈఓ ద్వారకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎస్‌జీఎఫ్ అండర్-19 హాకీ జిల్లా స్థాయి ఎంపికలు

కడప స్పోర్ట్స్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఈనెల 14వ తేదీ శుక్రవారం ఉదయం 10గంటలకు అండర్-19 హాకీ జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి చంద్రమోహన్‌రాజు తెలిపారు. జిల్లాలోని హాకీ క్రీడాకారులు అదే రోజు ఉదయం 9గంటల లోపు స్పోర్ట్స్ స్కూల్ హాకీ మైదానం చేరుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9182001781, 9849817064 నెంబర్లను సంప్రదించాలన్నారు.

విధుల నుంచి ప్రధానోపాధ్యాయుడి తొలగింపు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారి మఠంలోని కందిమల్లయ్యపల్లె ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్‌హెచ్ఎం ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ముచ్చర్ల రాధాక్రిష్ణమూర్తిని విధుల నుంచి తొలగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని ప్రధానోపాధ్యాయుడిపై ఆరోపణలు రావడంతో జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో రుజువైనట్లు తేలడంతో విధుల నుంచి తొలగించినట్లు డీఈవో తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలుగా షేక్ గౌసున్నీసాబేగం



మంత్రి ఫరూక్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గౌసున్నీసాబేగం

కమలాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యా యురాలిగా పరిధిలోని పెద్దచెప్పలి ఎంపీపీ ఉర్దూ స్కూలు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న షేక్ గౌసున్నీసా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందు కుంది. బుధవారం విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ, మైనార్టీస్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాల సందర్భంగా జాతీయ విద్యాదినోత్సవం పురస్కరించుకుని ఆమెకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేశారు. గౌసున్నీసాబేగం ఉపాధ్యాయ వృత్తిలో 24 సంవత్సరాల నుంచి సేవలందిస్తున్నారు. ఈమె విద్యలో చేస్తున్న సేవలను గుర్తించిన అధికారులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ చేతుల మీదుగా అందుకున్నారు.

నైపుణ్యం ఆధారిత విద్య అభివృద్ధి జరగాలి

- వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాణ్యతతో పాటు నైపుణ్య ఆధారిత విద్యను అభివృద్ధి చేయాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ కోరారు. బుధవారం వైవీయూ తాళ్లపాక అన్నమాచార్య సెనేట్ హాల్లో జరిగిన ప్రిన్సిపాల్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడ్మిషన్ల తగ్గుదలపై సమీక్షించి, విద్యార్థుల అకడమిక్ పెర్ఫార్మెన్స్ అండ్ అసెస్ మెంట్ రికార్డ్ ఐడీలను సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. జాతీయ విద్యావిధానం-2020 అమలు, రోడ్‌మ్యాప్‌పై చర్చిస్తూ విశ్వవిద్యాలయం అన్ని అనుబంధ కళాశాలలకు సహకారం అందిస్తుందని తెలిపారు. విద్యా ప్రమాణాలు, సంస్థాగత పనితీరు మెరుగుపరచడంలో కళాశాలలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కళాశాలల అభివృద్ధి మండలి డీన్ ప్రొఫెసర్ రఘుబాబు, సంపత్‌కుమార్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన కల్వర్టు ఏర్పాటు





అధ్వానంగా ఉన్న పంట పొలాలకు వెళ్లే రహదారి, పైపులు వేసి రోడ్డు తయారు చేస్తున్న దృశ్యం

రాజుపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంకకు ఉన్న పైపులు పగిలిపోయి రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. ఈ దుస్థితి మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఈ విషయం రైతులు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి లక్ష రూపాయలు నిధులు మంజూరు చేశారు. దీంతో యుద్ధప్రాతిపదికన (రెండురోజుల్లోనే) కొత్త పైపులు వేసి పంట పొలాలకు దారి ఏర్పాటు చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు







సూర్య, ఎస్‌కె సమీర్, మహ్మద్ నవాజ్

కడప స్పోర్ట్స్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-19 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు బుధవారం డ్రాగా ముగిశాయి. కడప నగర శివారు ప్రాంత కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప- నెల్లూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 280 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో శివచరణ్ 151 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. రెండవ రోజు బుధవారం కడప జట్టు ఓవర్‌నైట్ స్కోర్ 280 పరుగుల వద్దే డిక్లేర్ చేసింది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 348 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో సూర్య 111 పరుగులు సాధించగా, ఎస్.కే. సమీర్ 119, ఎస్కె మహమ్మద్ నవాజ్ 58 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో చిత్తూరు-అనంతపురం జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 54 ఓవర్లలో కేవలం 146 పరుగులకే చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 40.1 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 80 పరుగులు చేసింది. రెండో రోజు బుధవారం ఓవర్‌నైట్ స్కోర్ 80 పరుగులతో తిరిగి బ్యాటింగ్‌కు చేపట్టి 87.5 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో మహ్మద్ అజహర్ 50 పరుగులు చేశారు. దీంతో చిత్తూరు జట్టుకు 45 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 43 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

సర్వేకు సహకరించండి

మదనపల్లె టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నవోదయ కాలనీలో ప్రజలు స్వమిత్వ సర్వేకు సహకరించాలని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, డిప్యూటీ ఎంపీడీఓ భారతి, పంచాయతీ కార్యదర్శి పుష్ప కోరారు. బుధవారం ఎంపీడీఓ మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాలిటీలోని చాలా మంది లబ్ధిదారులకు నవోదయ కాలనీలో స్థలాలు కేటాయించగా అక్కడ ఇండ్లు నిర్మించుకున్న పలువురు, పట్టణంలోనే ఇంకా నివసిస్తున్నారన్నారు. దీని వలన స్వమిత్వ సర్వే ఆలస్యమవుతోందన్నారు. లబ్ధిదారులు తప్పక వారి ఆధార్‌కార్డులు, ఇంటి పత్రాలు, పాస్‌పోర్టుసైజు ఫొటోలను వలసపల్లె సచివాలయంలో రెండు రోజుల్లోగా సమర్పించాలని కోరారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన రామకృష్ణ



మదనపల్లె అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం అమరావతిలో కలిసి విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ కలిశారు. తనకు డైరెక్టర్ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి, వారి పురోభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశామన్నారు. పార్టీ కోసం శ్రమించిన పతి ఒక్కరిని సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ గుర్తుపెట్టుకుంటారన్నారు.



న్యుమోనియా మరణాలను అరికట్టాలి



న్యుమోనియాపై వివరాలు వెల్లడిస్తున్న డీఐఓ ఉషశ్రీ

పీలేరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): న్యుమోనియా కారణంగా బాలల మరణాలను పూర్తిగా అరికట్టాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ ఉషశ్రీ తలపుల పీహెచ్‌సీ సిబ్బందిని ఆదేశించారు. ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రజలకు అవగాహన కల్పించిన ఆమె మాట్లాడుతూ పిల్లలకు జ్వరం, వేగంగా శ్వాస తీసుకోవడం, శ్వాస క్రియ ఇబ్బంది, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు న్యుమోనియా కావచ్చన్నారు. వాటిని నిర్లక్ష్యం చేయ కుండా వైద్య నిపుణులను సంప్రదించాలని గర్భిణులు, బాలింతలకు సూచించారు. పిల్లలకు న్యుమోనియా ప్రమాకరమని, చేతుల అపరిశుభ్రత, తక్కువ బరువుతో జననం, గాలి కాలు ష్యం, పోషకాహార లోపం గల 0-5 ఏళ్లలోపు పిల్లలు న్యుమోనియాకు సులభంగా గురవుతారన్నారు. పిల్లలకు ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలే పట్టడం, ఆ తరువాత సమతుల్య పోషకాహారం, సురక్షిత తాగునీరు, నిర్దేశించిన సమయాలకు టీకాలు వేయించడంతో న్యుమోనియా రాకుండా పిల్లలను కాపాడుకోవచ్చన్నారు. అనంతరం న్యుమోనియా అవగాహన పోస్టర్లు ఆవిష్కరించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు గిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో మంత్రి సత్యకుమార్

బి.కొత్తకోట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ బుధవారం బి.కొత్తకోట మండల పరిధి పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు విచ్చేశారు. సాయంత్రం 6గంటలకు హిల్స్‌కు చేరుకున్న మంత్రికి ఏపీ టూరిజం సిబ్బంది సాదరస్వాగతం పలికారు. మంత్రి గవర్నర్ బంగ్లాలో విడిది చేశారు. పలువురు బీజేపీ నేతలు, మంత్రి అనుయాయులు సత్యకుమార్‌ను కలిశారు. గురువారం మదనపల్లిలో మంత్రి ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చి హార్సిలీహిల్స్‌లో బసచేసినట్లు తెలుస్తోంది.

విత్తనశుద్ధితో అధిక దిగుబడి



రైతులకు అవగహన కల్పిస్తున్న ఏఓ శ్రీనివాస్

కలకడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వేరుశనగ సాగులో విత్తనశుద్ధి పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ శ్రీనివాస్ అన్నారు. పోలం-పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గుడిబండ, కోన ఆర్ఎస్‌కె పరిధిలోని రైతులకు ఉలవపంట యాజమాన్య పద్ధతులపై అవగహన కల్పించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ రబీలో వేరుశనగ పంటను ఎంచుకునే వారు ఎకరాకు 80కిలోల విత్తనం వాడి, చదరపు మీటరు విస్తీర్ణంలో 44 మొక్కలు వుండేలా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ఇంద్రజ, అనిల్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ యూనివర్సిటీలో పరిశోధనల అవార్డులు



ప్రతిభావంతులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందిస్తున్న యూనివర్సిటీ వైస్ చాన్సెలర్ యువరాజ్

కురబలకోట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలం, అంగళ్లులోని మిట్స్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో 2024-2025 విద్యాసంవత్సరానికి పరిశోధన అవార్డుల కార్యక్రమంలో బుధవారం నిర్వహించారు. యూనివర్సిటీలోని అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధనలో రాణిస్తున్నారని, ఇందులో ప్రతిభ కనపర్చిన వారికి ప్రశంస పత్రాలు, నగదు బహుమతులు అందజేసినట్లు యూనివర్సిటీ వైస్‌చాన్సెలర్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ప్రపంచ స్థాయిలో ప్రఖ్యాతి పొందిన వెబ్ ఆఫ్ సైన్స్, స్కోపస్, ఎస్‌సీఐ. ఐఈఈఈ మొదలైన వాటిలో అధ్యాపకుల, విద్యార్థులు పరిశోధన పత్రాలను ప్రచురించారన్నారు. ఏటా అధ్యాపకులు, విద్యార్థులను ప్రోత్సాహం అందించడానికి ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో రూ. 21లక్షల 31వేలను యూనివర్సిటీలో 500మంది అధ్యాపకులు, విద్యార్థులు లబ్ధిపొందారన్నారు. ఈ ప్రోత్సాహకాలను యూనివర్సిటీ ఫౌండర్, చాన్సెలర్ డాక్టర్ విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రో చాన్సెలర్ ఎస్. ద్వారకనాథ్, వైస్ చాన్సెలర్ డాక్టర్ యువరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్, అడ్వైజర్ డాక్టర్ తులసీరామ్ నాయుడు, అసోసియేట్ డీన్ డాక్టర్ శివయ్య, డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ శ్రీమంత బసు, పాల్గొన్నారు.

రాయితీ ఉలవలను సద్వినియోగం చేసుకోండి

గుర్రంకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతన్నలకు ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న ఉలవలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రత్నమ్మ పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండలానికి 200 కింటాళ్ల ఉలవలు వచ్చినట్లు చెప్పారు. ఈ ఉలవలను ప్రతి రైతు సేవా కేంద్రంలో గురువారం నుంచి పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా 10 కిలోల బస్తా ధర రూ.112గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు భూమి పాసుపుస్తకం, ఆధార్ కార్డును తీసుకెళ్లి ఉలవలను తీసుకోవాలని ఆమె తెలిపారు.



ప్రైవేటీకరణను విరమించాలి

● మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పీలేరులో వైసీపీ నిరసన ర్యాలీ

పీలేరు రూరల్ , నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 10 మెడికల్ కళాశాలల పీపీపీ విధానం యత్నాన్ని విరమించాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, వైసీపీ పీలేరు ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పీలేరులో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టిన వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా మెడికల్ కాలేజీల్లో పీపీపీ విధానం అనేది లేదని, గోవా, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకతతో ఆ పద్ధతిపై వెనక్కి తగ్గాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రత్నశేఖర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, నేతలు కంభం సతీష్ రెడ్డి, ముడుపుల వేముల మధుసూదన్ రెడ్డి, సుంకర చక్రధర్, ఎం. భానుప్రకాష్‌రెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మూరే భానురెడ్డి, టీ.ఉదయ్‌కుమార్, వీపీ రమేష్ రెడ్డి, లోకనాథరెడ్డి, కాలనీ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కలికిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం నుంచి 20వ తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి విజయకుమార్ తెలిపారు. మొదటి రోజు ప్రారంభ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, 16న కవి సమ్మేళనం, 17న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ, 18న స్త్రీ సాధికారితపై చర్చ, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం, 19న విద్యార్థులకు వివిధ రకాల పోటీలు, 20వ తేదీన బహుమతి ప్రదానోత్సవం, ముగింపు వేడుకలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సందర్శించడం అలవాటుగా చేసుకోవాలని కోరారు. డీఎస్సీ అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో వుంచామన్నారు. 2025 టెట్ పరీక్షలకు అన్ని రకాల పుస్త కాలు గ్రంథాలయంలో సిద్ధంగా వున్నాయని వెల్లడించారు. 58వ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రైతులు వ్యవసాయంలో సేంద్రియ ఎరువులు వాడాలి

నిమ్మనపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేయాలని ఏఓ మంజుల పేర్కొన్నారు. బుధవారం తవళం పంచాయతీలో పొలం పిలుస్తోందిలో ఆమె మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంతో భూమి ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు స్థిరమైన వ్యవసాయం సాధ్యమవుతుందన్నారు. అలాగే రైతులు వారు పండించే పంటల్లో అంతర పంటలుగా మినుము, మొక్కజొన్న, సజ్జ, నువ్వులు, అలసంద వంటి వాటిని వేయవచ్చని తెలిపారు. ఈ పంటలు వేయడం ద్వారా రైతుకు ఆదాయం చేకూరుతుందని తెలిపారు. ప్రస్తుతం అన్ని గ్రామ పంచాయతీల్లో సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేస్తున్నారని కావలసిన రైతులు ఆధార్ కార్డు తెచ్చి తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు గణేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మధుర మీనాక్షి ఫ్రెషర్స్ డే

బి.కొత్తకోట, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మధురమీనాక్షి డిగ్రీకాలేజీలో బుధవారం ఫ్రెషర్స్‌డే వేడుకను నిర్వహించారు. విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వం ప్రభాకర్‌రెడ్డి, స్థానిక ఆయుర్వేద వైద్యులు వివి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాలేజీ కరెస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జావీద్ తదితరులు పాల్గొన్నారు.

కూలీల శాతం పెంచకపోతే చర్యలు తప్పవు

నిమ్మనపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల శాతం పెంచకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా ఉపాధి కూలీ ప్రోగ్రెస్‌పై టెక్నికల్, ఫీల్డ్‌సిస్టెంట్‌లో వివరాలు సేకరించారు. పది పంచాయతీల్లోనూ కూలీల శాతం గణనీయంగా తగ్గడంతో వారిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల గడిస్తే మాత్రం జీతాలు తీసుకుని కూలీలను పెట్టడంలో నిర్లక్ష్యం కనపరుస్తూ అలసత్వం వహించడం సరికాదన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో పర్యటించి కూలీల శాతం పెంచేందుకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



ప్రమాణ స్వీకారం ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్మన్ శివరామ్, డైరెక్టర్లు

మదనపల్లె టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చైర్మన్ జంగాల శివరామ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో జనసేన రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి ఆధ్వర్యంలో సభా వేదిక ఏర్పాట్లను శివరామ్ పర్యవేక్షించిన ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 10.36గంటలకు నిర్వహించే చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణస్వీకారోత్సవానికి మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యయాదవ్, మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి హాజరువుతున్నారన్నారు. వీరితో పాటు మదనపల్లె, పీలేరు, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు షాజహాన్‌బాష, నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి, అరవ శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని కూటమి నేతలు, రైతులు పెద్దసంఖ్యలో తమ ప్రమాణ స్వీకారానికి హాజరవాలని ఆయన కోరారు. కార్యక్రమం లో వైస్‌చైర్మన్ ఆంజనేయులు, డైరెక్టర్లు చల్లా నరసింహులు, సుబ్రమణ్యం రెడ్డి, మునిరాజ, లక్ష్మీపతి జనసేన టౌన్ అధ్యక్షుడు నాయని జగదీశ్, బీజేపీ నేతలు డాక్టర్ అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

వాల్మీకిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, పీలేరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత కంభం నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పునుగుపల్లె వద్ద 63కేవీ నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ వాల్మీకిపురం పట్టణం, చింతపర్తిల్లో మరో ఎనిమిది 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇకపై లోటల్టేజీ సమస్య ఉండదని గృహ వినియోగదారులకు, రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా ఇస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంతో అవినీతికి చోటుచేసుకుందని అలా కాకుండా అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. రెవెన్యూ, హౌసింగ్, ఉపాధి అధికారులతో మాట్లాడుతూ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే ప్రజలను, రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, మండల టీడీపీ అధ్యక్షుడు కంభం దామోదర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్, నేతలు వీపీ నారాయణ, రాజేంద్రాచారి, ద్వారకనాథరెడ్డి, శేషాద్రిరెడ్డి, కేవీ రెడ్డి, మనోహర, రామాంజులురెడ్డి, ఆది, గాంధీపేట రెడ్డి, రెడ్డిరామ్, ట్రాన్స్‌కో లైన్‌మెన్ శంకర, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నమండెంకు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడును కలిసిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు

నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యం

● మెగా మేళాలో 280 మంది ఎంపిక



మెగాజాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ నిర్మూలనకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా విశేషంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. బుధవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగాజాబ్‌మేళాలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన పరిశ్రమలు స్థాపించడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని, పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగం దూరమవుతుందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16వేల మందికిపైగా ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు. ఇప్పుడు మెగాజాబ్ మేళా ద్వారా టెన్త్ నుంచి పీజీ చదివిన నిరుద్యోగులకు వారి అర్హతబట్టి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. కరెస్పాండెంట్ గురుప్రసాద్ మాట్లాడుతూ మెగాజాబ్‌మేళాకు 915 మంది హాజరవగా వారిలో 280 మంది పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అఖిల్‌అలీ సయ్యద్, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ దొనప్ప, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్, ప్రిన్సిపాల్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

'కిడ్నీ' నిందితులను అరెస్టు చేయాలి

మదనపల్లె అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్బీఐ కాలనీలోని కిడ్నీ రాకెట్ వ్యవహారంతో ఓ మహిళ మృతికి కారణమైన గ్లోబుల్ ఆస్పత్రిని వెంటనే మూసివేయాలని, బాధ్యత వహించిన డాక్టర్లు, నిందితులను అరెస్టు చేయాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్, సీపీఐ నేత కృష్ణప్ప, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ వేరువేరుగా మీడియా సమావేశాల్లో డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ మదనపల్లెలో ఇలాంటి ఉదంతం జరగడం దారుణమన్నారు. డాక్టర్ ఆంజనేయులు, బెంగళూరు వైద్యుడు, మదనపల్లె డయాలసిస్ సెంటర్‌లో పని చేసే బాలరంగడు, కదిరి డయాలసిస్‌లో పని చేసే మరొకరు, ఇందులో క్రియాశీలకంగా ఉన్న కాకర్ల సత్య, పెళ్లి పద్మ, వెంకటేశ్వర్లు, నీరజ్, తదితరులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్లోబుల్ ఆస్పత్రిని సీజ్ చేసి, వారిపై కేసులను నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

